సాక్షి
అనంతపురం

సోమవారం : 26 : మే : 2025



రాప్తాడులో రౌడీ రాజ్యం

రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం ఏర్పాటైనప్పటి నుంచి రాప్తాడు నియోజకవర్గంలో రౌడీ రాజ్యం నడుస్తోందని మాజీ ఎమ్మెల్యే తోపుదుర్తి ప్రకాష్‌రెడ్డి ధ్వజమెత్తారు. 8లో



పెద్దల పొరపాటుతో ఘర్షణ

ఎమ్మెల్యే, ఆర్డీఓ, తహసీల్దార్ చేసిన తప్పునకు గ్రామంలో ఘర్షణ వాతావరణం నెలకొంది. 8లో

గరిష్టం/కనిష్టం
34.8°/23.2°

జిల్లా అంతటా ఆదివారం ఉష్ణోగ్రతలు తగ్గాయి. ఆకాశం మేఘావృతమై అక్కడక్కడా తేలికపాటి వర్షం కురిసింది. నైరుతి దిశగా గంటకు 6 నుంచి 10 కిలోమీటర్ల వేగంతో గాలులు వీచాయి.

న్యూస్‌రీల్

నేడు తాడిపత్రిలో 'పరిష్కార వేదిక'



అనంతపురం అర్బన్: 'ప్రజా సమస్యల పరిష్కార వేదిక'ను సోమవారం తాడిపత్రి పట్టణంలో నిర్వహించనున్నట్లు కలెక్టర్ వి.వినోద్‌కుమార్ తెలిపారు. పట్టణంలోని మునిసిపల్ కార్యాలయంలో ఉదయం 9 నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు కార్యక్రమం జరుగుతుందన్నారు. అన్ని శాఖల జిల్లా అధికారులు పాల్గొంటారని, ప్రజలు తమ సమస్యలను అర్జీ రూపంలో సమర్పించాల్సి ఉంటుందన్నారు. గతంలో అర్జీ ఇచ్చి ఉంటే దానికి సంబంధించి రసీదు తీసుకురావాలన్నారు. తాడిపత్రి పట్టణ, మండల ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కలెక్టర్ సూచించారు.

40 శాతం రాయితీతో విత్తన వేరుశనగ



అనంతపురం అగ్రికల్చర్: రైతులకు విత్తన వేరుశనగపై 40 శాతం రాయితీ వర్తింపజేసినట్లు వ్యవసాయశాఖ జేడీ కార్యాలయ వర్గాలు ఆదివారం ఒక ప్రకటనలో తెలిపాయి. ఈ ఏడాది 50,592 క్వింటాళ్ల వేరుశనగ కేటాయించారు. కే-6తో పాటు టీసీజీఎస్-1,694, కదిరి-లేపాక్షి (కే-1,812) విత్తన రకాలు పంపిణీ చేయనున్నట్లు తెలిపారు. కే-6, టీసీజీఎస్-1,694 రకం క్వింటా పూర్తి ధర రూ.9,300 కాగా అందులో 40 శాతం రూ. 3,720 రాయితీ పోనూ రైతులు తమ వాటా కింద రూ.5,580 ప్రకారం చెల్లించాల్సి ఉంటుంది. కే-1,812 రకం పూర్తి ధర రూ.8,200 కాగా రూ.3,280 రాయితీ పోనూ రైతులు రూ.4,920 చెల్లించాలి. ఒక్కో రైతుకు గరిష్టంగా మూడు బస్తాలు (ఒక్కోటి 30 కిలోలు) పంపిణీ చేయనున్నట్లు ప్రకటించారు. ఇక.. 30 శాతం రాయితీతో కందులు, మినుములు, పెసలు, 50 శాతం రాయితీతో కొర్రలు, రాగులు, 50 శాతం రాయితీతో జనుము, జీలుగ, పిల్లిపెసర లాంటి పచ్చిరొట్ట విత్తనాలు జూన్ మొదటి వారంలో పంపిణీ చేయనున్నట్లు అధికారులు తెలిపారు. జిల్లా వ్యాప్తంగా 10 ప్రాసెసింగ్ ప్లాంట్లలో వేరుశనగ విత్తనశుద్ధి జరుగుతున్నట్లు వెల్లడించారు. ఇప్పటికే కొన్ని ఆర్‌ఎస్‌కేలకు విత్తన సరఫరా చేసినట్లు వ్యవసాయ, ఏపీ సీడ్స్ వర్గాలు తెలిపాయి.

ఎలుగుబంట్ల హల్‌చల్



రోషన్ కొండ వద్ద సంచరిస్తున్న ఎలుగుబంట్లు

కళ్యాణదుర్గం రూరల్: కళ్యాణదుర్గం పట్టణంలోని రోషన్ కొండ సమీపంలో ఆదివారం రెండు ఎలుగుబంట్లు హల్‌చల్ చేశాయి. ఈ క్రమంలోనే ఉరుసు ఉత్సవానికి వచ్చిన భక్తులు భయాందోళనకు గురయ్యారు. స్థానికులు కేకలు వేయడంతో భల్లూకాలు కొండల్లోకి పారిపోయాయి. ఇటీవల కళ్యాణదుర్గం పరిసర ప్రాంతాల్లో ఎలుగుబంట్లు జనావాసాల్లోకి చొరబడుతున్నాయి. రెండు రోజుల క్రితం మండల పరిధిలోని మోరేపల్లి గ్రామం వద్ద వ్యక్తిపై ఎలుగుబంటి దాడి చేసింది. ఫారెస్ట్ అధికారులు స్పందించి ఎలుగుబంట్ల బారి నుంచి కాపాడాలని స్థానికులు కోరుతున్నారు.

'యోగాంధ్ర'కు రిజిస్ట్రేషన్ చేసుకోండి : కలెక్టర్

YOGANDHRA
Government of Andhra Pradesh
Yogandhra 2025 Participant

యోగాంధ్ర క్యూఆర్ కోడ్

అనంతపురం అర్బన్: యోగాంధ్ర కార్యక్రమంలో అందరూ భాగస్వాములు కావాలని, ఇందుకోసం ముందస్తుగా రిజిస్ట్రేషన్ చేసుకోవాలని జిల్లా ప్రజలకు కలెక్టర్ వి.వినోద్‌కుమార్ పిలుపునిచ్చారు. జూన్ 21న అంతర్జాతీయ యోగా దినోత్సవాన్ని పురస్కరించుకుని ఈ నెల 21వ తేదీ నుంచి జిల్లావ్యాప్తంగా యోగాంధ్ర-2025 క్యాంపెయిన్ నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. ఈ మేరకు ఆదివారం ఓ ప్రకటన విడుదల చేశారు. ఈ కార్యక్రమంలో భాగస్వాములయ్యేందుకు https://yogandhra.ap.gov.in వెబ్‌సైట్ ద్వారా లేదా క్యూఆర్ కోడ్‌ను స్కాన్ చేయడం ద్వారా పేర్లు నమోదు చేసుకోవాలని సూచించారు.

రైతన్నలకు కష్ట కాలం!



ఏడాదిగా నిలిచిన డీ-పట్టా రిజిస్ట్రేషన్లు

- కూటమి ప్రభుత్వం ఫ్రీజింగ్‌లో పెట్టడంతో సమస్య
- ఫ్రీహోల్డ్ భూముల పరిశీలన పేరుతో సాగదీత
- వర్ణనాతీతంగా అన్నదాతల ఆవేదన

అనంతపురం అర్బన్: కూటమి ప్రభుత్వంలో రైతన్నలకు 'కష్ట' కాలం నడుస్తోంది. అకాల వర్షాల కారణంగా పంటలు దెబ్బతిని నష్టపోతున్నా.. పరిహారం ఇవ్వడం లేదు... బీమా రాలేదు. అప్పుల ఊబిలో కూరుకుపోతున్నా పెట్టుబడి సాయం కింద రూ.20 వేలు అందించడం లేదు. ఈ క్రమంలోనే డీ-పట్టా పొందిన అసైన్డ్ భూములకు అర్హత ఉన్నప్పటికీ ఏడాదిగా రిజిస్ట్రేషన్ కాకపోవడంతో బాధితులు లబోదిబోమంటున్నారు. ఈ భూములకు సంబంధించి ఎలాంటి లావాదేవీలు జరపకుండా కూటమి ప్రభుత్వం ఫ్రీజింగ్‌లో పెట్టడంతో సమస్య తలెత్తింది. ఫ్రీహోల్డ్ భూముల పరిశీలన పేరుతో చంద్రబాబు సర్కారు అవలంబిస్తున్న సాగదీత వైఖరి అసైనీలుగా ఉన్న రైతులకు శాపంగా మారింది. ఆర్థిక అవసరాలకూ భూములను అమ్ముకోలేక చాలా మంది తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారు. తమ సమస్యను బహిరంగంగా చెప్పుకునేందుకూ రైతులు సాహసించలేని పరిస్థితి నెలకొంది. ఆవేదనను బయటకు చెబితే ఎటువైపు నుంచి కొత్త సమస్య వస్తుందోనని ఆందోళన చెందుతున్నారు.

- ప్రభుత్వ నిబంధనల ప్రకారం 1954 జూన్ 18 కంటే ముందు అసైన్డ్ అయిన భూములకు నిరభ్యంతర పత్రం ఉంటుంది. ఇలాంటి భూములు జిల్లాలో 50 వేల ఎకరాల వరకు ఉండవచ్చని అంచనా. కూటమి ప్రభుత్వం మొత్తం అసైన్డ్ భూములకు సంబంధించి క్రయ, విక్రయాలు, ఇతర ఎలాంటి లావాదేవీలు నిర్వహించకుండా ఏడాదిగా ఫ్రీజింగ్‌లో పెట్టింది. దీంతో నిరభ్యంతర పత్రం (ఎన్‌ఓసీ) పొందిన అసైన్డ్ భూములు కూడా రిజిస్ట్రేషన్ కావడం లేదు.

ఏడాదవుతున్నా..

ప్రభుత్వ భూములను 20 ఏళ్ల క్రితం అసైన్మెంట్‌గా పొందిన వారికి ఫ్రీహోల్డ్ ద్వారా యాజమాన్య హక్కు కల్పించేందుకు గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం చర్యలు చేపట్టింది. అటు తరువాత కూటమి ప్రభుత్వం రావడంతో ఫ్రీహోల్డ్ భూముల పరిశీలనకు తెరతీసింది. అయితే, ఏడాది అవుతున్నా ఈ ప్రక్రియ పూర్తి చేయలేదు. ఎప్పటికప్పుడు గడువును పొడిస్తూ సాగదీస్తూనే ఉన్నారు. పరిశీలన పూర్తయ్యే వరకు ఫ్రీజింగ్‌ను కొనసాగించే అవకాశం ఉండడంతో రైతుల కష్టాలు ఇప్పట్లో తొలిగేలా లేవు.

జిల్లాలో అసైన్డ్ భూమి ఇలా

అసైన్డ్ చేసిన మొత్తం భూమి	2,22,902.05 ఎకరాలు
డీ-పట్టా పొందిన అసైనీలు	78,040
భూమి కలిగిన నిజమైన అసైనీలు	28,115
నిజమైన అసైనీల వద్ద ఉన్న భూమి	75,828 ఎకరాలు
అసైనీల వారసులు	44,156
వారసుల వద్ద ఉన్న భూమి	1,33,425.42 ఎకరాలు
అసైన్డ్ భూమి తీసుకున్న థర్డ్ పార్టీ	5,769
థర్డ్ పార్టీ వద్ద ఉన్న భూమి	13,648.63 ఎకరాలు

పరిశీలన జరుగుతోంది



ఫ్రీహోల్డ్ భూముల పరిశీలన ప్రక్రియ జరుగుతోంది. మరో రెండు నెలల్లో పూర్తికావొచ్చు. అటు తరువాత అసైన్డ్ భూములకు సంబంధించి లావాదేవీలకు ప్రభుత్వం అనుమతి ఇస్తుంది.
- వి.వినోద్‌కుమార్, కలెక్టర్

రేయ్ సాయిరాం నిన్ను చంపేస్తాం...

- తాడిపత్రిలో అర్ధరాత్రి వేళ రెచ్చిపోయిన టీడీపీ మూకలు



సాయిరాం ఇంటి వద్ద పడిన రాళ్లు

తాడిపత్రిటౌన్: తాడిపత్రిలో శనివారం అర్ధరాత్రి టీడీపీ అల్లరి మూకలు రెచ్చిపోయాయి. వైఎస్సార్‌సీపీ నాయకుడు, మాజీ ఎమ్మెల్యే కేతిరెడ్డి పెద్దారెడ్డి ప్రధాన అనుచరుడు సాయిరాం ఇంటిపై రాళ్లదాడికి తెగబడ్డాయి. దీంతో పట్టణవాసులు భయభ్రాంతులకు గురయ్యారు. వివరాలు... తాడిపత్రిలోని భగత్‌సింగ్ నగర్‌లో నివాసముంటున్న సాయిరాం ఇంటి వద్దకు శనివారం అర్ధరాత్రి 10 మంది టీడీపీ అల్లరి మూకలు మద్యం మత్తులో స్కార్పియో వాహనంలో చేరుకున్నాయి. 'రేయ్ సాయిరాం.. బయటకు రారా.. నిన్ను చంపేస్తాం'' అంటూ కేకలు వేస్తూ హల్‌చల్ చేశాయి. దీంతో సాయిరాం కుటుంబ సభ్యులతో పాటు కాలనీ వాసులు భయభ్రాంతులకు గురయ్యారు. బిక్కుబిక్కుమంటూ లోపలే ఉండిపోయారు. ఎంత అరిచినా సాయిరాం బయటకు రాకపోవడంతో అల్లరి మూకలు అతని ఇంటిపై రాళ్ల దాడికి దిగాయి. ఇంటి తలుపులు, ద్విచక్ర వాహనాన్ని ధ్వంసం చేశాయి. ఫోన్‌లో సాయిరాం ఇచ్చిన సమాచారంతో పోలీసులు ఘటనాస్థలికి చేరుకోగా.. మెల్లిగా అక్కడి నుంచి అల్లరి మూకలు జారుకున్నాయి. బాధితుడి ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేశారు. సీసీ ఫుటేజీ ఆధారంగా దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ సాయిప్రసాద్ తెలిపారు.


ఇదేం తాగుడు బాబోయ్..

- 8 నెలల్లో రికార్డు స్థాయిలో అమ్మకాలు
- రూ.1,100 కోట్ల మద్యం వినియోగం

సాక్షి ప్రతినిధి, అనంతపురం: ఉమ్మడి అనంతపురం జిల్లాలో మద్యం ఏరులై పారుతోంది. పేద, మధ్యతరగతి ప్రజలు తాము సంపాదించిన సొమ్ములో సగం మద్యానికి ఖర్చు చేస్తున్నారు. ఊరూరా బెల్టుషాపులు ఏర్పాటు కావడంతో మద్యం ప్రజల చెంతకే వెళ్లినట్టయింది. దీంతో వినియోగం కూడా భారీగా పెరిగింది. రోజుకు రూ.4.60 కోట్ల విలువ చేసే మద్యం తాగుతున్నారంటే పరిస్థితి ఎలా ఉందో అంచనా వేయొచ్చు. సరిగ్గా 8 నెలల క్రితం చంద్రబాబు సర్కారు కొత్త మద్యం పాలసీని అందుబాటులోకి తెచ్చింది. అప్పటినుంచి శ్రీ సత్యసాయి, అనంతపురం జిల్లాల్లో మద్యం ఏరులై పారుతోంది.

రూ.1,100 కోట్లు దాటింది...

గడిచిన ఎనిమిది మాసాల్లో అంటే 2024 సెప్టెంబర్ 15 నుంచి మే 15 వరకూ రూ.1,100 కోట్ల మద్యం వినియోగించారు. అంటే సగటున రోజుకు రూ.4.58 కోట్ల మద్యం తాగుతున్నారు. అనంతపురం జిల్లాలో 1,200కు పైగా, శ్రీ సత్యసాయి జిల్లాలో 750కి పైగా మద్యం షాపులు ఉన్నాయి. ఇవి కాకుండా అర్బన్ ప్రాంతాల్లో పర్మిట్ రూములు ఏర్పాటు చేశారు. గల్లీ గల్లీకి, గ్రామ గ్రామానికి మద్యాన్ని అందుబాటులోకి తేవడం, బహిరంగ మద్యపానంపై ఎలాంటి నియంత్రణ లేకపోవడం వల్ల మద్య సేవనం విచ్చలవిడిగా మారింది.



కూరగాయల షాపులకంటే మద్యం షాపులే ఎక్కువ..

ఉమ్మడి అనంతపురం జిల్లాలో కూరగాయలు అమ్మే షాపుల కంటే మద్యం షాపులు, బెల్టు షాపులు, పర్మిట్ రూములే ఎక్కువగా కనిపిస్తున్నాయి. టీడీపీ ఎమ్మెల్యేలే లిక్కర్ షాపులు నిర్వహిస్తుండటంతో విక్రయాలకు అడ్డూ అదుపు లేకుండా పోయింది. వేళా పాళా ఉండటం లేదు. ఉదయం 6 గంటలకే మద్యం షాపులు తెరుస్తున్నారు. గుడులు, బడులు, ఆస్పత్రులు ఏమీ లెక్క చేయకుండా ఎక్కడ పడితే అక్కడ మద్యం అమ్ముతున్నారు. ఇదిలాఉంటే.. మద్యం విచ్చలవిడి అమ్మకాల వల్ల నేరాలు పెరుగుతున్నట్టు తెలుస్తోంది. దీన్నే 'లిక్కర్ బేస్డ్ క్రైమ్'గా పోలీసులు చెబుతున్నారు. తాగిన మత్తులో ఇతరులపైనా, కుటుంబ సభ్యులపైనా, భార్యలపైనా దాడులకు దిగడం ఎక్కువైంది. గత 40 ఏళ్లలో ఎన్నడూ లేని విధంగా ఉమ్మడి అనంతపురం జిల్లాలో 8 నెలల్లోనే రూ.1,100 కోట్ల విలువైన మద్యం అమ్ముడుబోవడం రికార్డు అని నిపుణులు చెబుతున్నారు.

ఉమ్మడి అనంతపురం జిల్లాలో మద్యం వినియోగం.. విలువ ఇలా..

మద్యం వినియోగం (లీటర్లలో)	1,37,87,433
అనంతపురం జిల్లాలో మద్యం వినియోగం (లీటర్లలో)	85,54,446
శ్రీ సత్యసాయి జిల్లాలో వినియోగం.. (లీటర్లలో)	52,32,987
అనంతపురం జిల్లాలో వినియోగమైన మద్యం విలువ	రూ.691కోట్లు
శ్రీ సత్యసాయి జిల్లాలో మద్యం వినియోగం విలువ	రూ.409 కోట్లు

సజావుగా సివిల్స్ ప్రిలిమినరీ

- 59.50 శాతం అభ్యర్థుల హాజరు



అనంతపురం ఎస్ఎస్‌బీఎన్ కళాశాల కేంద్రంలోకి అభ్యర్థులను తనిఖీ చేసి పంపుతున్న పోలీసులు



పరీక్ష కేంద్రాన్ని తనిఖీ చేస్తున్న పరిశీలకులు ఎంఎం నాయక్, చిత్రంలో జేసీ శివ్‌నారాయణ్‌శర్మ

అనంతపురం అర్బన్/అనంతపురం: యూనియన్ పబ్లిక్ సర్వీస్ కమిషన్ (యూపీఎస్సీ) ఆధ్వర్యంలో ఆదివారం నిర్వహించిన సివిల్ సర్వీసెస్ ప్రిలిమినరీ పరీక్ష సజావుగా జరిగింది. ఏడు కేంద్రాల్లో పరీక్ష నిర్వహించారు. కేంద్రాల వద్ద పోలీసులు పటిష్ట బందోబస్తు చేపట్టారు. ఎలక్ట్రానిక్ పరికరాలు, వాచ్‌లు, మొబైల్ ఫోన్లు పరీక్ష కేంద్రాల్లోకి తీసుకెళ్లకుండా చర్యలు తీసుకున్నారు. కేంద్రాలకు సమీపంలో జిరాక్స్, నెట్ సెంటర్‌లను మూసివేయించారు. కాగా.. ఉదయం, మధ్యాహ్నం రెండు సెషన్లుగా సాగిన పరీక్షలో అభ్యర్థుల హాజరు 59.50 శాతంగా నమోదైంది. 2,546 మంది హాజరవ్వాల్సి ఉండగా ఉదయం పేపర్-1 పరీక్షకు కేవలం 1,522 మంది హాజరయ్యారు. 1,024 మంది గైర్హాజరయ్యారు. మధ్యాహ్నం జరిగిన పేపర్-2 పరీక్షకు 1,515 మంది హాజరుకాగా 1,031 మంది గైర్హాజరయ్యారు. పరీక్ష కేంద్రాలను జిల్లా పరిశీలకులు ఎంఎం నాయక్, కలెక్టర్ వి.వినోద్‌కుమార్, జేసీ శివ్ నారాయణ్ శర్మ పరిశీలించారు.

ప్చ్.. అదృష్టం లేదు!

యూపీఎస్సీ నిబంధనల ప్రకారం నిర్దేశించిన పరీక్ష సమయాని కంటే గంట ముందే కేంద్రాలకు చేరుకోవాలని అధికారులు స్పష్టం చేస్తూ వచ్చారు. ఉదయం 9 తరువాత, మధ్యాహ్నం 2 గంటల తరువాత కేంద్రంలోకి అనుమతించబోమని పేర్కొన్నారు. అయితే ఆదివారం కొందరు అభ్యర్థులు ఆలస్యంగా కేంద్రాలకు వచ్చారు. ఎస్ఎస్‌బీఎన్ కళాశాల కేంద్రంలో పరీక్షకు హాజరవ్వాల్సిన కదిరికి చెందిన షర్మిల, కర్నూలుకు చెందిన కిరణ్, అనంతపురం నగరానికి చెందిన స్రవంతి ఆలస్యంగా రావడంతో అనుమతించలేదు. మరికొన్ని కేంద్రాల్లోనూ ఆలస్యంగా వచ్చిన అభ్యర్థులను లోపలికి పంపలేదు.

అన్నదాతను నిండా ముంచారు..



నీట మునిగిన వేరుశనగ పంట, (ఇన్‌సెట్‌లో) హంద్రీ-నీవా కాలువకు గండికొడుతున్న దృశ్యం

- హంద్రీ-నీవా పనుల్లో ఇష్టారాజ్యం
- కాంట్రాక్టర్ నిర్లక్ష్యంతో ఐదెకరాల్లో నీట మునిగిన వేరుశనగ పంట

ఉరవకొండ: హంద్రీ-నీవా కాలువ పనుల్లో భాగంగా కాంట్రాక్టరు నిర్లక్ష్యం కారణంగా ఓ రైతు పంట నష్టపోయాడు. వివరాలు.. ఉరవకొండ మండలం రాకెట్ల గ్రామ సమీపంలో హంద్రీ-నీవా 22వ కిలోమీటరు వద్ద కాలువ పనులు జరుగుతున్నాయి. గ్రామానికి చెందిన పి.శ్రీనివాసులు సర్వే నంబర్ 282-1బీలో తనకున్న 5 ఎకరాల్లో 2 నెలల క్రితం వేరుశనగ పంట సాగు చేశాడు. పంట పెట్టుబడుల కోసమని రూ.3 లక్షల వరకు అప్పు చేశాడు. ఇటీవల కురిసిన భారీ వర్షాలకు హంద్రీ-నీవాలో భారీగా నీరు చేరింది. దీంతో పనులకు అంతరాయం కలగడంతో ఆదివారం కాలువకు కాంట్రాక్టర్ గండి కొట్టి పక్కనే ఉన్న పి.శ్రీనివాసులు పొలంలోకి నీటిని వదిలాడు. దీంతో పంట మొత్తం నీట మునిగింది. విషయం తెలుసుకున్న రైతు అక్కడకు చేరుకుని సైట్ ఇంజినీర్ చంద్రతో మాట్లాడితే.. ఆయన నిర్లక్ష్యంగా సమాధానమిస్తూ.. టీడీపీ నేతలే గండి కొట్టమని చెప్పారని, ఎవరితోనైనా చెప్పుకో పొమ్మంటూ దురుసుగా ప్రవర్తించాడు. తనకు జరిగిన అన్యాయంపై మంత్రి పయ్యావుల కేశవ్ స్పందించాలని, తనకు పరిహారం చెల్లించేలా చర్యలు తీసుకోవాలని బాధిత రైతు విన్నవించాడు. కాగా, ఈ విషయం తెలుసుకున్న సీపీఐ, సీపీఎం జిల్లా కార్యదర్శులు జాఫర్, ఓ.నల్లప్ప, కౌలు రైతు సంఘం నాయకులు బాలరంగయ్య స్పందించారు. బాధిత రైతుకు పరిహారం చెల్లించకపోతే తీవ్ర స్థాయిలో ఉద్యమిస్తామని హెచ్చరించారు.

చిత్ర విచిత్రాలు.. టీచర్ల గగ్గోలు

- టీచర్ల బదిలీ ఆన్‌లైన్ దరఖాస్తులో సాంకేతిక సమస్యలు
- మాయమైపోతున్న పాయింట్లు
- ఉన్న పాయింట్లు చూపని వెబ్‌సైట్
- చివరకు దరఖాస్తులూ కనిపించని వైనం
- డీఈఓ కార్యాలయం చుట్టూ ఉపాధ్యాయుల ప్రదక్షిణలు
- తమ చేతుల్లో లేదంటున్న అధికారులు



వెబెక్స్‌లో పాల్గొన్న రెండు జిల్లాల డీఈఓలు, సిబ్బంది

అనంతపురం ఎడ్యుకేషన్: టీచర్ల బదిలీ దరఖాస్తులో చిత్రవిచిత్రాలు చోటుచేసుకుంటున్నాయి. ఎవరికి ఏ పాయింట్లు నమోదవుతున్నాయో, అవి ఎప్పుడు తొలగిపోతాయో అంతుచిక్కడం లేదు. దీంతో ఉపాధ్యాయులు గగ్గోలు పెడుతున్నారు. బదిలీల దరఖాస్తు ప్రక్రియను సాంకేతికపరమైన సమస్యలు చుట్టుముట్టాయి. దరఖాస్తు చేసిన సమయంలో నమోదు చేసిన పాయింట్లు హార్డ్‌కాపీ ప్రింట్ తీసుకునేలోపు మాయమవుతున్నాయి. పాఠశాల ఒక కేటగిరీ కింద ఉంటే...వెబ్‌సైట్‌లో మరో కేటగిరీ పాయింట్లు కనిపిస్తున్నాయి. రీ అపోర్షన్‌కు గురైన టీచర్లకు స్పెషల్ పాయింట్లు కనిపించడం లేదు. జనరేట్ అయిన స్పౌజ్ ప్రత్యేక పాయింట్లు గల్లంతయ్యాయి. గార్లదిన్నె మండలంలో ఓ గణితం టీచరుకు దరఖాస్తు చేసుకున్న రోజు 43.4898 పాయింట్లు చూపించగా రెండోరోజు 43.4713 పాయింట్లు, మూడోరోజు (ఆదివారం) 38.4713 పాయింట్లు చూపిస్తోంది. ఇక సోమవారం (నేడు) ఎన్ని పాయింట్లు కనిపిస్తాయోనని సదరు టీచరు బెంబేలెత్తుతున్నారు. చివరకు కొందరు ప్రధానోపాధ్యాయులు దరఖాస్తు చేసిన ఫారాలు కూడా వెబ్‌సైట్‌లో కనిపించకపోవడంతో లబోదిబోమంటున్నారు. 'టీచర్ల బదిలీ చట్టం-2025' ఆన్‌లైన్ దరఖాస్తు ప్రక్రియ టీచర్లకు సమస్యగా మారింది. దరఖాస్తు గడువు ముంచుకొస్తుండడంతో ఉపాధ్యాయులు తీవ్ర ఆందోళన చెందుతున్నారు. ఉమ్మడి జిల్లా నలుమూలల నుంచి అనంతపురంలో బదిలీల ప్రక్రియ జరుగుతున్న శారదా స్కూల్‌కు పరుగులు పెడుతున్నారు. సాంకేతిక సమస్యల పరిష్కారం తమ పరిధిలో లేదంటూ ఇక్కడి అధికారులు స్పష్టం చేస్తున్నారు.

హెచ్ఎం దరఖాస్తులు మాయం..

ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసి... హార్డ్‌కాపీలు ప్రింట్ తీసుకుని అధికారులకు అందజేసి నిర్ధారణ చేసిన తర్వాత కొందరు హెచ్ఎంల పేర్లు తాత్కాలిక సీనియార్టీ జాబితాలో కనిపించలేదు. తాడిపత్రి మండలం చుక్కలూరు జెడ్పీహెచ్ఎస్ హెచ్ఎం సి.సుధాకర్ ఈనెల 21న ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేశారు. డౌన్‌లోడ్ చేసుకుని 22న గుత్తి డీవైఈఓకు సబ్‌మిట్ చేశారు. ఆన్‌లైన్ దరఖాస్తు అటు డీవైఈఓ లాగిన్‌లోనూ, ఇటు డీఈఓ లాగిన్‌లోనూ కనిపించలేదు. ఈలోగా గడువు ముగిసి తాత్కాలిక సీనియార్టీ జాబితా విడుదలైంది. ఇందులో సుధాకర్ పేరే లేదు. డీఈఓను కలిసి తన గోడు వెళ్లబోసుకున్నారు. కాగా సుధాకర్ రిక్వెస్ట్ బదిలీకి దరఖాస్తు చేసుకున్నారు. అదే తప్పనిసరి బదిలీ అయి ఉండి ఇలా ఆన్‌లైన్‌లో దరఖాస్తు కనిపించకపోతే పెద్ద సమస్య అయ్యేదని టీచర్లు చెబుతున్నారు. మరో 10 మందిదాకా హెచ్ఎంలు సుధాకర్ లాంటి సమస్యను ఎదుర్కొన్నట్లు తెలుస్తోంది.

స్కూల్ 3వ కేటగిరీ.. పాయింట్లు ఒకటో కేటగిరీవి..

శ్రీసత్యసాయి జిల్లా బుక్కపట్నం మండలం అగ్రహారం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల గణితం టీచరు బి.రామాంజనేయులు 8 ఏళ్ల పూర్తి కావడంతో తప్పనిసరి బదిలీకి దరఖాస్తు చేసుకున్నారు. అగ్రహారం జెడ్పీహెచ్ఎస్ 3వ కేటగిరీలో ఉంది. అంటే ఏడాదికి మూడు పాయింట్ల చొప్పున 24 పాయింట్లు రావాల్సి ఉంది. ఆన్‌లైన్‌లో ఈ స్కూల్ కేటగిరీ-1లో ఉన్నట్టు చూపిస్తోంది. కేటగిరీ-1కు ఏడాదికి ఒక పాయింట్ మాత్రమే వస్తుంది. ఈ లెక్కన మొత్తం 8 పాయింట్లు మాత్రమే చూపిస్తోంది. మూడు రోజులుగా డీఈఓ కార్యాలయం చుట్టూ తిరుగుతున్నా... ఏ ఒక్కరూ స్పందించడం లేదని రామాంజనేయులు వాపోతున్నారు.

క్లుప్తంగా

ఏఐజీడీఏ జోనల్ కార్యదర్శిగా రమేష్‌బాబు



నియామక ఉత్తర్వులు అందుకుంటున్న రమేష్‌బాబు

అనంతపురం ఎడ్యుకేషన్: ఆలిండియా ప్రభుత్వ డ్రైవర్ల సంఘం (ఏఐజీడీఏ) కన్ఫరడేషన్ జోనల్ (ఆంధ్రప్రదేశ్, తెలంగాణ, కర్ణాటక, తమిళనాడు, గోవా, ఒడిశా) సెక్రెటరీగా జిల్లా ప్రభుత్వ డ్రైవర్ల సంఘం అధ్యక్షుడు పి.రమేష్‌బాబును నియమించారు. ఆదివారం ఆలిండియా గవర్నమెంట్ డ్రైవర్ల సంఘం కన్ఫడరేషన్ సమావేశం చత్తీస్‌ఘడ్‌లో జరిగింది. 18 రాష్ట్రాల నుంచి సంఘం అధ్యక్షులు హాజరయ్యారు. ఈ సందర్భంగా ఏఐజీడీఏ కన్ఫరడేషన్ జోనల్ కార్యదర్శిగా రమేష్‌బాబుకు నియామక ఉత్తర్వులను ఆ సంఘం జాతీయ అధ్యక్షుడు వై.నాగేశ్వరరావు అందజేశారు.

ట్రాక్టర్ ఢీకొని యువకుడి మృతి

పామిడి: ట్రాక్టర్ ఢీకొన్న ఘటనలో ద్విచక్ర వాహనంపై వెళుతున్న ఓ యువకుడు దుర్మరణం పాలయ్యాడు. పోలీసులు తెలిపిన మేరకు.. గార్లదిన్నె మండలం కల్లూరు గ్రామానికి చెందిన వడ్ల చంద్రశేఖర్(38) అలియాస్ శేఖర్ చీనీ, వేరుశనగ, వడ్ల వ్యాపారంతో కుటుంబాన్ని పోషించుకుంటున్నాడు. వ్యాపారంలో భాగంగా పామిడికి చెందిన పిక్కిలి రామకృష్ణతో కలసి శనివారం గుంతకల్లు మండలం నాగసముద్రం గ్రామానికి వెళ్లాడు. అక్కడ పని ముగించుకున్న అనంతరం ద్విచక్ర వాహనంపై అర్ధరాత్రి తిరుగు ప్రయాణమైన భోజనం చేసేందుకు 44వ జాతీయ రహదారిపై ఉన్న ఓ ధాబాకు చేరుకున్నారు. అప్పటికే మూసేయడంతో ధాబా సమీపంలోనే ద్విచక్ర వాహనం వద్ద నిలబడి మాట్లాడుకుంటుండగా... ఖల్సా ధాబా యజమాని తేజ ట్రాక్టర్‌పై వస్తూ ద్విచక్ర వాహనాన్ని ఢీకొన్నాడు. ఘటనలో ట్రాక్టర్ అదుపు తప్పి చంద్రశేఖర్‌పై పడడంతో ఆయన అక్కడికక్కడే మృతి చెందాడు. సమాచారం అందుకున్న పోలీసులు అక్కడకు చేరుకుని పరిశీలించి, కేసు నమోదు చేశారు. కాగా, చంద్రశేఖర్‌కు భార్య లక్ష్మి ఓ కుమారుడు, కుమార్తె ఉన్నారు.

హెచ్‌ఎం నిర్ధారించకుండానే ఎంఈఓ ఆమోదం

అనంతపురం ఎడ్యుకేషన్: ఆన్‌లైన్‌లో బదిలీలకు దరఖాస్తు చేసుకున్న స్కూల్ అసిస్టెంట్లకు సంబంధించి దరఖాస్తుల హార్డ్‌కాపీలను సంబంధిత హెచ్‌ఎంలు నిర్ధారించి...వాటిని ఎంఈఓలకు అందజేస్తే వారి లాగిన్‌లో ఆమోదించాల్సి ఉంది. ఈ ప్రక్రియకు ఆదివారం తుది గడువు. ఇంతటి కీలక సమయంలో ఉన్నతాధికారుల ఆదేశాలను బేఖాతరు చేస్తూ పెద్దపప్పూరు మండలం ముచ్చుకోట జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల హెచ్‌ఎం సుబ్రహ్మణ్యం మూడు రోజులుగా పత్తా లేకుండా పోయాడు. దరఖాస్తు చేసుకున్న టీచర్లు తీవ్ర ఆందోళనకు గురయ్యారు. ఎంఈఓ రవికుమార్‌ను అడిగితే...హెచ్‌ఎం నిర్ధారించిన తర్వాతనే లాగిన్‌లో అప్‌లోడ్ చేస్తానని స్పష్టం చేశారు. అయితే స్కూల్ అసిస్టెంట్ల దరఖాస్తులను పరిశీలించి... ఎంఈఓలు తమ లాగిన్‌లో అప్‌లోడ్ చేసేందుకు ఆదివారమే చివరి గడువు కావడంతో దరఖాస్తు చేసుకున్న ఆ స్కూల్ టీచర్లు తీవ్ర ఆందోళనకు గురయ్యారు. విషయాన్ని డీఈఓ, గుత్తి డీవైఈఓ దృష్టికి తీసుకెళ్లారు. వారు నేరుగా ఎంఈఓ రవికుమార్‌తో మాట్లాడారు. డీఈఓ మౌఖిక ఆదేశాల మేరకు చివరి నిముషంలో ఎంఈఓ అప్‌లోడ్ చేశారు.

చెరువు మట్టినీ మింగేస్తున్నారు!

- రాయలచెరువు గ్రామ సరిహద్దులో ఆగని మట్టి దోపిడీ
- 24 గంటలూ హిటాచీ, జేసీబీలతో తవ్వకాలు
- రోజూ రూ.లక్షలు చేతులు మారుతున్న వైనం
- చేష్టలుడిగి చూస్తున్న అధికార యంత్రాంగం



రాయలచెరువు వద్ద చెరువు మట్టిని హిటాచీలతో తవ్వి టిప్పర్లలో నింపుతున్న దృశ్యం

సాక్షి టాస్క్‌ఫోర్స్ : కూటమి సర్కారు కొలువుదీరాక అధికార పార్టీ నాయకుల నేతృత్వంలో సహజ వనరుల దోపిడీకి అడ్డూఅదుపు లేకుండా పోయింది. తాడిపత్రి నియోజకవర్గంలోని యాడికి మండలంలో కొండలు, గుట్టలు, వాగులు, వంకలు, కాలువ గట్లతో పాటు రాయలచెరువు గ్రామ సమీపంలోని చెరువులో మట్టినీ మింగేస్తున్నారు. పచ్చని ప్రకృతిపై పంజా విసిరి, సహజ వనరులను ధ్వంసం చేస్తున్నారు. చెరువులో రోజూ 500 టిప్పర్ల మట్టిని తోలుతూ రూ.కోట్లు కొల్లగొడుతున్నారు. పత్రికల్లో కథనాలు వస్తే ఒకటి, రెండు రోజులు ఇరిగేషన్ అధికారులు హడావుడి చేసి.. మిన్నకుండిపోతున్నారనే విమర్శలు వినిపిస్తున్నాయి.

మాట నిలబెట్టుకున్న పెద్దారెడ్డి

శ్రీకృష్ణదేవరాయలు కాలంలో రాయలచెరువు గ్రామ సమీపంలో రిజర్వు కొండ, ఊరుగట్టు, పిచ్చల కొండల మధ్య సర్వే నంబర్ 705లో 525 ఎకరాల సువిశాల విస్తీర్ణంలో చెరువు నిర్మించారు. ఈ మూడు కొండల్లో ఖనిజ నిక్షేపాలను తవ్వుకునేందుకు అధికారులు అనుమతులు ఇచ్చారు. తవ్వకాలు చేపట్టిన తర్వాత నుంచి క్రమేణా కొండల ఆనవాళ్లే లేకుండా పోతున్నాయి. 2017లో తాడిపత్రి నియోజకవర్గ వైఎస్సార్ సీపీ సమన్వయకర్తగా ఉన్న కేతిరెడ్డి పెద్దారెడ్డి యాడికి మండలం బోగాలకట్ట నుంచి రాయలచెరువు గ్రామం వరకు పాదయాత్ర చేపట్టిన సమయంలో తాను ఎమ్మెల్యేగా గెలుపొందితే చెరువును నింపి.. సమీపంలోని కాలువలకు నీటిని విడుదల చేస్తానని మాట ఇచ్చారు. ఆ మాట ప్రకారమే ఎమ్మెల్యే అయ్యాక నాలుగు సార్లు రాయలచెరువు చెరువును నింపి.. కాలువల ద్వారా నీటిని విడుదల చేశారు.

చెరువును విస్మరించిన జేసీ కుటుంబం

తాడిపత్రి నియోజకవర్గం నుంచి గెలిచిన జేసీ సోదరులు 35 ఏళ్ల రాజకీయ జీవితంలో రాయలచెరువును పూర్తిగా విస్మరించారు. తమ స్వలాభం కోసం చెరువును నీటితో నింపకుండా వదిలేశారు. ఇక్కడ రైతులు, కూలీలు ఎప్పుడూ దయనీయ స్థితిలో ఉండటమే వారు కోరుకున్నారని కేతిరెడ్డి పెద్దారెడ్డి పలు సందర్భాల్లో జేసీ సోదరులను విమర్శించారు. ఎన్నికల సమయంలో తప్ప మరెప్పుడూ ప్రజల వద్దకు వెళ్లరని, వారికి ఏదైనా సమస్యను చెప్పాలన్నా ప్రజలు భయపడిపోయేవారని అన్నారు.

చెరువు మట్టిని దోచేస్తున్నారిలా..

అధికార పార్టీకి చెందిన యాడికి మాజీ ప్రజాప్రతినిధి ఆధ్వర్యంలో గత ఏడాది అక్టోబర్ నుంచి మట్టి దోపిడీ కొనసాగుతోంది. మూడు హిటాచీలతో రోజుకు 500 టిప్పర్ల మేర రాయలచెరువు నుంచి మట్టిని తవ్వేస్తున్నారు. ఇప్పటి వరకు వంద ఎకరాల విస్తీర్ణంలో మట్టిని తవ్వేసినట్లు తెలుస్తోంది. రాయలచెరువు పరిసర ప్రాంతాల్లోని పొలాలైతే టిప్పర్‌కు రూ.3 వేల ప్రకారం, వేరే మండలాలకు దూరాన్ని బట్టి రూ.10వేల వరకు వసూలు చేస్తూ జేబులు నింపుకుంటున్నారు. చెరువు మట్టిని అధికారుల అనుమతితో రైతులు ఉచితంగా పొలాలకు తరలించుకునే వెసులుబాటు ఉంది. అయితే టీడీపీ నాయకులు మాత్రం రైతులను చెరువు దరిదాపులకు రానివ్వకుండా తాము నిర్ణయించిన ధరతోనే తీసుకోవాలని హుకుం జారీ చేస్తున్నారు.

మట్టి తవ్వకాలకు అనుమతుల్లేవు

రాయలచెరువు 525 ఎకరాల విస్తీర్ణంలో ఉంది. ఇక్కడ మట్టి తవ్వకాలకు ఎవ్వరికీ అనుమతులు లేవు. అయితే కొంతమంది రైతులు తమ పొలాలకు మట్టి కావాలని కోరితే ఇరిగేషన్ శాఖ అధికారులకు నివేదిక పంపించాం.

– ప్రతాప్‌రెడ్డి, తహసీల్దార్, యాడికి

రాప్తాడులో రౌడీ రాజ్యం

- భూకబ్జాలు, దాడులతో విధ్వంసాలు
- హంద్రీ నీవా లైనింగ్ పనులతో రైతులకు తీరని అన్యాయం
- న్యాయం కోరుతూ ఈ నెల 29 నుంచి రాప్తాడు నియోజకవర్గంలో అన్నదాతల రిలే నిరాహార దీక్షలు
- వైఎస్సార్‌సీపీ నాయకుల సమావేశంలో మాజీ ఎమ్మెల్యే తోపుదుర్తి ప్రకాష్‌రెడ్డి



సమావేశంలో మాట్లాడుతున్న తోపుదుర్తి ప్రకాష్‌రెడ్డి

ఆత్మకూరు: రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం ఏర్పాటైనప్పటి నుంచి రాప్తాడు నియోజకవర్గంలో రౌడీ రాజ్యం నడుస్తోందని మాజీ ఎమ్మెల్యే తోపుదుర్తి ప్రకాష్‌రెడ్డి ధ్వజమెత్తారు. ఆత్మకూరు మండలం తోపుదుర్తిలో ఆదివారం ఆయన వైఎస్సార్‌సీపీ నాయకులతో సమావేశమై మాట్లాడారు. ప్రజలను భయభ్రాంతులకు గురి చేస్తూ టీడీపీ నాయకులు భూకబ్జాలు, దాడులతో విధ్వంసాలకు పాల్పడుతున్నారని మండిపడ్డారు. దివంగత వైఎస్సార్ హయాంలో హంద్రీ నీవా కాలువ పనులు చేపట్టి కృష్ణా జలాలను జిల్లాకు అందించారని గుర్తు చేశారు. ఈ కాలువను 83 టీఎంసీల నీటి ప్రవాహ సామర్థ్యానికి పెంచేలా గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో అప్పటి సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పనులు ప్రారంభించారని, అయితే కూటమి ప్రభుత్వం ఏర్పాటు కాగానే 40 టీఎంసీలకే పరిమితం చేస్తూ కాలువకు లైనింగ్ పనులను సీఎం చంద్రబాబు చేపట్టారని తెలిపారు. కాలువకు లైనింగ్ పనులు పూర్తయితే రాప్తాడు నియోజకవర్గంలో 2 లక్షల ఎకరాలు, హిందూపురం పార్లమెంట్ పరిధిలో దాదాపు 5 లక్షల ఎకరాలు బీళ్లుగా మారుతాయన్నారు. దీనికి నిరసనగా ఈ నెల 29వ తేదీ నుంచి రాప్తాడు నియోజకవర్గంలోని అన్ని మండలాల్లోని రైతులతో కలసి ఆయా మండలంలోనే రిలే నిరాహార దీక్షలను చేపట్టనున్నట్లు పేర్కొన్నారు.

అంతా అక్రమ ఆదాయమే..

రాప్తాడు నియోజకవర్గంలో ఇప్పటికే ముగ్గురిని అతి కిరాతకంగా టీడీపీ నాయకులు హతమార్చారన్నారు. 300కు పైగా అక్రమ కేసులతో దౌర్జన్యాలకు దిగారన్నారు. ఇక దాడుల్లో గాయపడిన వారి సంఖ్య కూడా భారీగా ఉందన్నారు. లేని భూ సమస్యలను సృష్టించి సెటిల్‌మెంట్‌లకు రాకపోతే హత్యలు చేయిస్తున్నారన్నారు. రూ.లక్షల్లోనే మట్టి దోపిడీలు సాగిస్తున్నారన్నారు. కక్కలపల్లి టమాట మండిలో శ్రీరామ్ ట్యాక్స్ నడుస్తోందన్నారు. ఏడాదికి రూ.5 కోట్లకు పైగా అక్రమంగా దోచుకుంటున్నారన్నారు. మద్యం దుకాణాల్లో బాటిల్‌పై రూ.10 శ్రీరామ్ ట్యాక్స్ అంటూ వసూలు చేస్తున్నారన్నారు. కంకర మిషన్ నుంచి రూ.లక్షల్లో వసూలు చేస్తున్నారన్నారు. ఇసుక అమ్ముకునేందుకు వీలుగా పేరూరు డ్యాంకు నీరు రాకుండా చేస్తున్నారన్నారు.

వైఎస్సార్‌సీపీ హయాంలోనే అభివృద్ధి

వైఎస్సార్‌సీపీ హయాంలోనే నియోజకవర్గంలో అభివృద్ధి పనులు జరిగాయి తప్ప కూటమి ప్రభుత్వంలో కాదన్నారు. జీడిపల్లి నుంచి ఆత్మకూరుకు నీటిని అందించేందుకు రూ.170 కోట్లు ఖర్చు చేశామన్నారు. విద్యుత్ సమస్యల పరిష్కారానికి ఐదు సబ్ స్టేషన్లు తీసుకురాగా, వీటిలో తోపుదుర్తి, గొరిదిండ్ల సబ్‌స్టేషన్ల పనులను ఈ ప్రభుత్వం మొదలు పెట్టకుండా కాలయాపన చేస్తోందన్నారు. అనంతపురం – తగరకుంట మార్గంలో సగం రోడ్డు పూర్తి చేస్తే ఆ తర్వాత సగం రోడ్డు పనులకు కనీసం కంకర కూడా వేయలేదన్నారు. పీఏబీఆర్ నుంచి రూ.67 కోట్లతో తాగునీటి పనులు పూర్తి చేసినట్లు గుర్తు చేశారు. అధికారంలోకి వచ్చి ఏడాది కావస్తున్నా... నియోజకవర్గ అభివృద్ధి గురించి ఎమ్మెల్యే పరిటాల సునీత ఏ మాత్రం పట్టించుకోవడం లేదని, కేవలం ప్రకాష్‌రెడ్డిని విమర్శించడమే పనిగా పెట్టుకున్నారని మండిపడ్డారు. పరిటాల సునీత నేతృత్వంలోనే అనంతపురం రూరల్ పరిధిలో ఇళ్లు కూల్చారని, దోపిడీలు, హత్యలు జరిగాయని తెలిపారు. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో గార్మెంట్ పరిశ్రమ తీసుకువచ్చామని, అలాగే చేతనైతే పరిటాల సునీత కూడా నియోజకవర్గానికి నూతన పరిశ్రమలు తీసుకురావాలని అన్నారు. అనంతపురంలోని కళ్యాణదుర్గం లో రోడ్డులో 68 సెంట్లలో 20 ఇళ్లు కూల్చేసి ఆ స్థలంపై కన్నేస్తే బాధితుల పక్షాన నిలిచి కోర్టుకు వెళ్లి స్టే ఆర్డర్ తెప్పించామని గుర్తు చేశారు. ఇప్పటికైనా ప్రకాష్‌రెడ్డిని విమర్శించడం మాని నియోజకవర్గ అభివృద్ధి దృష్టిపెట్టాలని హితవు పలికారు.

తాగునీటి పథకం కార్మికుడి దుర్మరణం



సూరప్ప (ఫైల్)

గుంతకల్లు/వజ్రకరూరు: ద్విచక్ర వాహనం అదుపు తప్పి కిందపడిన ఘటనలో ఓ కార్మికుడు దుర్మరణం పాలయ్యాడు. వివరాలు.. గుంతకల్లులోని ఆలూరు రోడ్డులో నివాసముంటున్న మంగే సూరప్ప (47) వజ్రకరూరు మండలం కొనకొండ్లలోని శ్రీసత్యసాయి తాగునీటి పథకంలో పనిచేస్తూ కుటుంబాన్ని పోషించుకుంటున్నాడు. రోజూ ద్విచక్ర వాహనంపై కొనకొండ్లకు వెళ్లి వచ్చేవాడు. ఈ నేపథ్యంలో విధుల్లో పాల్గొనేందుకు శనివారం రాత్రి 10 గంటలకు ద్విచక్ర వాహనంపై కొనకొండ్లకు బయలుదేరాడు. మార్గ మధ్యంలో రోడ్డుకు అడ్డుగా వచ్చిన గేదెలు ద్విచక్ర వాహనాన్ని తగలడంతో కింద పడి అక్కడికక్కడే మృతి చెందాడు. ఘటనపై వజ్రకరూరు పోలీసులు కేసు నమోదు చేశారు. మృతునికి భార్య రోజా, ఓ కుమారుడు, కుమార్తె ఉన్నారు. విషయం తెలుసుకున్న సీఐటీయూ పట్టణ ప్రధాన కార్యదర్శి సాకే నాగరాజు, తాగునీటి పథకం కార్మికుల సంఘం నాయకుడు పి.చిన్న బాబయ్య గుంతకల్లులోని ప్రభుత్వాస్పత్రి మార్చురీలో ఉంచిన సూరప్ప మృతదేహాన్ని పరిశీలించి, నివాళులర్పించారు. బాధిత కుటుంబ సభ్యులను పరామర్శించారు. అనంతరం వారు మాట్లాడుతూ.. సూరప్ప మృతిపై ఆర్‌డబ్ల్యూఎస్ అధికారులు స్పందించకపోవడం దారుణమన్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి వెంటనే రూ.20 లక్షల పరిహారం చెల్లించడంతో పాటు ఆయన కుటుంబంలోని ఒకరికి ఉద్యోగం ఇవ్వాలని డిమాండ్ చేశారు. వారి వెంట నాయకులు తిమ్మప్ప, సురేంద్ర, కె.రామాంజినేయులు, వెంకటాద్రి, సంతోష్ ఉన్నారు.

'అ'పూర్వ' సమ్మేళనం



నాటి గురువులతో 1984-85 బ్యాచ్ పదో తరగతి విద్యార్థులు

పామిడి: స్థానిక టీసీ ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో 1984–85 విద్యాసంవత్సంలో పదో తరగతి చదువుకున్న వారు అదే పాఠశాల వేదికగా ఆదివారం కలుసుకున్నారు. 40 ఏళ్ల తర్వాత కలుసుకున్న చిన్ననాటి స్నేహితుల ఆనందానికి అవధుల్లేకుండా పోయాయి. నాటి అల్లరి పనులు గుర్తు చేసుకుని మురిసిపోయారు. తమకు విద్యాబుద్ధులు చెప్పిన నాటి గురువులు ఆత్మానంద, వెంకటరమణప్ప, గురురాజమూర్తిని ఘనంగా సన్మానించి, ఆశీర్వాదం తీసుకున్నారు. కార్యక్రమానికి పూర్వ విద్యార్థులు అమరేంద్ర, తిరుపాలు, పీడీ గోపాల్, హెచ్.నారాయణరావు, గోపాల్‌రెడ్డి, నగేష్, ఎంపీ శ్రీనివాసులు, రాజశేఖర్, రఘునాథ శర్మ నేతృత్వం వహించారు. శేషగిరి, మునిస్వామి, సతీష్‌కుమార్, శ్రీనివాసులు, సదానందబాబు, వెంకటేశ్వరరావు, పులిశేఖర్ కార్యనిర్వాహకులుగా వ్యవహరించారు.

ఆటో డ్రైవర్ చెప్పిన నీతి పాఠం



గుంతలకు మట్టి వేస్తున్న ఆటో డ్రైవర్ గంగరాజు

పుట్లూరు: నిజం.. ఇది ఓ ఆటో డ్రైవర్ చెప్పిన నీతి పాఠమే. ఇందులోని సారాంశం అర్థమైన వారు శభాష్ గంగరాజు అంటూ సదరు ఆటో డ్రైవర్‌ను అభినందనలతో ముంచెత్తుతున్నారు. వివరాల్లోకి వెళితే... పుట్లూరు మండలం ఎల్లుట్ల గ్రామం నుంచి గూగూడుకు వెళ్లే మార్గం మొత్తం గుంతలమయంగా మారింది. కొన్ని నెలలుగా ఇదే పరిస్థితి. ఇంత కాలం ప్రభుత్వం స్పందించి కొత్తగా రోడ్డు నిర్మాణం చేపడుతుందని, అలా కాకున్నా... కనీసం మరమ్మతులైనా చేపడుతుందని గ్రామీణులు ఆశించారు. అయినా కనుచూపు మేరలో అలాంటి చర్యలు చేపడుతున్న దాఖలాలు కనిపించలేదు. ఇటీవల కురిసిన వర్షాలకు ఈ రహదారి మరింతగా దెబ్బతినింది. దీంతో ఈ రోడ్డుపై ప్రయాణం చేయాలంటే వాహనదారులు పడరాని పాట్లు పడేవారు. ఇలాంటి తరుణంలో రహదారి మరమ్మతులకు ప్రభుత్వం నిధులు కేటాయించి, పనులు చేపట్టాలంటే ఎప్పుడవుతుందో తెలియని పరిస్థితి. విషయాన్ని గమనించిన ఎల్లుట్లకు చెందిన ఆటో డ్రైవర్ గంగరాజు సమయస్ఫూర్తితో వ్యవహరించారు. స్వయంగా రంగంలో దిగి తన రోజు వారి సంపాదన రూ.1,200 చొప్పున రెండు రోజుల ఆదాయం రూ.2,400 వదులుకుని ఒంటరిగానే మట్టితో గుంతలను పూడ్చి వేశారు. అటుగా వెళుతున్న వాహనదారులు 'ఏందయ్యా గంగరాజు... ఏమిటీ పని ఒప్పుకున్నావా?' అన్ని ప్రశ్నిస్తే.. 'గుంతల వల్ల రోజూ ఎవరో ఒకరు కిందపడుతూనే ఉన్నారు కదన్నా.. ఎవరూ పట్టించుకోవడం లేదు. అందుకే ప్రమాదాలు ఏవీ జరగకూడదని మట్టితో గుంతలను పూడుస్తున్నా' అంటూ నవ్వుతూ సమాధానమిచ్చారు. ఇది చూసిన పలువురు శభాష్ గంగరాజు అంటూ మెచ్చుకున్నారు.

పెద్దల పొరపాటు.. ఇరువర్గాల ఘర్షణ



అధికారుల సమక్షంలోనే వాగ్వాదం చేసుకుంటున్న ఇరువర్గాల వారు

రాప్తాడు: ఎమ్మెల్యే, ఆర్డీఓ, తహసీల్దార్ చేసిన పొరపాటుకు గ్రామంలో ఇరువర్గాల మధ్య ఘర్షణ వాతావరణం నెలకొని రెండు రోజుల పాటు ఉద్రిక్త పరిస్థితులు చోటు చేసుకున్నాయి. వివరాలు.. రాప్తాడు మండలం భోగినేపల్లి గ్రామంలో శనివారం ఉదయం 10 గంటలకు అనారోగ్యంతో మాల రామచంద్ర (61) మృతి చెందాడు. దీంతో కుటుంబసభ్యులు మృతదేహాన్ని ఖననం చేయడానికి అదే రోజు సాయంత్రం ఆ గ్రామానికి తూర్పున శ్మశాన వాటికకు కేటాయించిన స్థలంలో గుంత తీసేందుకు కొందరు దళితులు అక్కడికి వెళ్లడంతో ఆ స్థలం తమదంటూ అదే గ్రామానికి చెందిన పలువురు కాలువ గొంచి రైతులు అడ్డుకున్నారు. విషయం తెలుసుకున్న దళిత సంఘాల నాయకులు అక్కడకు చేరుకున్నారు. మృతదేహాన్ని అక్కడే ఖననం చేయాలంటూ రోడ్డుపై మృతదేహాన్ని ఉంచి ఆందోళన చేశారు. విషయం తెలుసుకున్న రాప్తాడు, రూరల్ సీఐలు శ్రీహర్ష, శేఖర్, సిబ్బంది అక్కడకు చేరుకుని చర్చలు జరిపినా ఫలితం లేకపోయింది. వందేళ్లుగా తమ పూర్వీకుల అనుభవంలో ఉంటూ వచ్చిన భూమిని దళితుల శ్మశాన వాటికకు ఎలా కేటాయిస్తారంటూ కాలువగొంచి నిర్వాహకులు మండిపడ్డారు. అయితే తమ సామాజిక వర్గానికి చెందిన శ్మశాన వాటిక లేక పడుతున్న ఇబ్బందులను గత ఏడాది ఎమ్మెల్యే పరిటాల సునీత దృష్టికి తీసుకెళ్లడంతో గ్రామానికి తూర్పున ఉన్న సర్వే నంబర్ 281–4లో 1.08 ఎకరాలను దళితుల శ్మశాన వాటికకు కేటాయించాలంటూ అప్పట్లో ఆర్డీఓకు ఎమ్మెల్యే సూచించారని, దీంతో నాలుగు నెలల క్రితం శ్మశాన వాటికకు కేటాయిస్తూ తహసీల్దార్ విజయకుమారి పట్టాను ఎమ్మెల్యే పరిటాల సునీత చేతుల మీదుగానే తమకు ఇప్పించారంటూ దళితులు ప్రతిగా స్పందించారు. ఈ విషయంపైనే తాము కోర్టును ఆశ్రయించి స్టే తెచ్చినట్లుగా కాలువగొంచి రైతులు అప్పటికే తమ వద్ద సిద్ధంగా ఉంచుకున్న కోర్టు స్టే ఆర్డర్‌ను చూపారు. గ్రామానికి దక్షిణం వైపు 3.80 ఎకరాల శ్మశాన వాటిక ఉందని, అక్కడికెళ్లి ఖననం చేసుకోవాలని సూచించారు. సమస్య కొలిక్కి రాకపోవడంతో ఆదివారం మధ్యాహ్నం 2 గంటలకు ఆర్డీఓ కేశవనాయుడు ఆదేశాలతో తహసీల్దార్ విజయకుమారి అక్కడకు చేరుకుని దళితులతో చర్చించారు. కోర్టు ఆదేశాలను గౌరవించాలని సూచించారు. ఈ అంశంలో న్యాయం చేస్తానని, శ్మశాన వాటికకు ప్రత్యేక స్థలాన్ని కేటాయిస్తామని హామీనివ్వడంతో ఆందోళనను విరమించి పాత శ్మశాన వాటికలోనే రామచంద్ర మృతదేహాన్ని ఖననం చేశారు. కాగా, ఘటనపై ఎస్సీ, ఎస్టీ సంఘాల జేఏసీ రాష్ట్ర అధ్యక్షుడు సాకే హరి మాట్లాడుతూ.. గ్రామంలో దళితులను ఎమ్మెల్యే పరిటాల సునీత మోసం చేసిందని ఆగ్రహం వ్యక్తం చేశారు. వెంటనే దళితులకు శ్మశాన వాటిక స్థలం కేటాయించకపోతే పెద్ద ఎత్తున ఆందోళన చేపడతామని హెచ్చరించారు.

ఘనంగా కనకదాస పురస్కారాల ప్రదానం



విద్యార్థికి పురస్కారం అందజేస్తున్న ఎంపీ పార్థసారథి, మాజీ మేయర్ పరుశురాం

అనంతపురం ఎడ్యుకేషన్: పదో తరగతి, ఇంటర్‌లో ప్రతిభ చాటిన కురుబ విద్యార్థులకు ఆదివారం స్థానిక గుత్తి రోడ్డు లోని కనకదాస కల్యాణమంటపంలో కురుబ ఉద్యోగుల సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో కనకదాస ప్రతిభా పురస్కారాలు అందజేశారు. కురుబ ఉద్యోగుల సంక్షేమ సంఘం అధ్యక్షులు ఆర్వేటి పద్మావతి అధ్యక్షత వహించిన ఈ కార్యక్రమానికి హిందూపురం ఎంపీ బీకే పార్థసారథి, అనంతపురం నగర మాజీ మేయర్ రాగే పరశురాం, సీపీఐ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యుడు డి.జగదీష్, కురుబ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు బోరంపల్లి ఆంజనేయులు, జిల్లా అధ్యక్షుడు తుప్పటి ఈశ్వరయ్య, ఆర్డీఓ మధులత, డాక్టర్ మహేష్ హాజరయ్యారు. ఈ సందర్భంగా వక్తలు మాట్లాడుతూ... కురుబ విద్యార్థులు చదువులో మంచి ప్రతిభ కనపరచడం కులానికే గర్వకారణమన్నారు. భవిష్యత్తులో మంచి ఉద్యోగాలు తెచ్చుకుని తల్లిదండ్రులు, కులానికి, సమాజానికి ఉపయోగపడాలన్నారు. ప్రతి కుటుంబంలోనూ ఆడపిల్లలను బాగా చదివించాలన్నారు. కార్యక్రమంలో సంఘం గౌరవ అధ్యక్షుడు దండు వెంకటరాముడు, ప్రధాన కార్యదర్శి మంగలకుంట నాగరాజు, కోశాధికారి ఓబులేసు, అడ్వయిజరీ చైర్మన్ గజ్జల రామకృష్ణ, సూర్యనారాయణ, జనార్దన్, ఉపాధ్యక్షులు బుల్లే ఆదినారాయణ, పాటల హరికృష్ణ, జగన్నాథ్, లక్ష్మీదేవి, శివ శంకర్, రమేష్, అక్కులప్ప, విద్యార్థుల తల్లిదండ్రులు, ప్రజాప్రతినిధులు, ఉద్యోగులు పాల్గొన్నారు.

విద్యతోనే ఉజ్వల భవిష్యత్తు

- వడ్డెర సేవా సంఘం జిల్లా అధ్యక్షుడు లక్ష్మీనారాయణ



విద్యార్థులకు ప్రతిభా పురస్కారాలు అందజేస్తున్న వడ్డెర సేవా సంఘం నాయకులు

అనంతపురం రూరల్: విద్య తోనే ఉజ్వల భవిష్యత్తు ఉంటుందని వడ్డెర సేవా సంఘం జిల్లా అధ్యక్షుడు లక్ష్మీనారాయణ అన్నారు. పది ఫలితాల్లో ప్రతిభ కనపరిచిన వడ్డెర విద్యార్థులకు ఆదివారం నగరంలోని ఒకటవ రోడ్డులో ఉన్న ఓ ఫంక్షన్ హాలులో ప్రతిభా పురస్కారాలను అందజేశారు. కార్యక్రమంలో లక్ష్మీనారాయణ మాట్లాడారు. తల్లిదండ్రుల కష్టాన్ని దృష్టిలో ఉంచుకుని చదువులో రాణించాలన్నారు. కార్యక్రమంలో నాయకులు వడ్డే శ్రీరాములు, మారుతీ ప్రసాద్, లోకనాథ్, గంగన్న, సూర్యబాబు, రాయుడు, శంకర్, రాజశేఖర్, వెంకటేష్ తదితరులు పాల్గొన్నారు.

ఏపీ ప్రభుత్వ ఉద్యోగుల సంఘం జిల్లా కమిటీ ఎన్నిక



నూతనంగా ఎన్నికైన కమిటీ సభ్యులు

అనంతపురం రూరల్: ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ ఉద్యోగుల సంఘం జిల్లా నూతన కమిటీని ఆదివారం ఆ సంఘం కార్యాలయంలో ఎన్నుకున్నారు. ఎన్నికల అధికారులుగా కృష్ణప్రసాద్, రఘురామానాయుడు వ్యవహరించారు. జిల్లా అధ్యక్షుడిగా గోపీకృష్ణ, ప్రధాన కార్యదర్శిగా రామునాయక్, అసోసియేట్ ప్రెసిడెంట్‌గా వేణుగోపాల్, ఉపాధ్యక్షులుగా అశోక్‌బాబు, నాగేశ్వరయ్య, వెంకటరాముడు, కలీం అహ్మద్, డాక్టర్ శివారెడ్డి, శ్రీధర్‌రెడ్డి, పాల్, కార్యనిర్వాహక కార్యదర్శిగా కేసీ నాగరాజు, జాయింట్ సెక్రటరీలుగా హనుమంతు, వరప్రసాద్, చంద్రశేఖర్, భారతమ్మ, మహబూబ్‌బాషా, వసంత, రామాంజినేయులు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. కార్యక్రమంలో రూరల్ కమిటీ అధ్యక్షుడు మారుతీప్రసాద్ పాల్గొన్నారు.

ప్రమాదంలో రిపోర్టర్ మృతి



నాగరాజు (ఫైల్)

ఉరవకొండ: స్థానిక 42వ జాతీయ రహదారిపై చోటు చేసుకున్న ప్రమాదంలో హెచ్‌ఎం టీవీ రిపోర్టర్ మృతిచెందాడు. పోలీసులు తెలిపిన మేరకు.. బూదగవి గ్రామానికి చెందిన బోయ నాగరాజు (32)కు భార్య, ఓ కుమారుడు ఉన్నారు. హెచ్‌ఎం టీవీ రిపోర్టర్‌గా పనిచేస్తూ కుటుంబాన్ని పోషించుకునేవాడు. ఆదివారం రాత్రి ఉరవకొండ నుంచి ద్విచక్రవాహనంపై స్వగ్రామానికి బయలుదేరిన ఆయన గ్రామ శివారులోకి చేరుకోగానే రోడ్డుకు అడ్డుగా ఉన్నఫళంగా వచ్చిన గేదెను ఢీకొనడంతో వాహనం అదుపు తప్పి కిందపడి తీవ్రంగా గాయపడ్డాడు. చాలా సేపటి తర్వాత అటుగా వెళుతున్న వారు గుర్తించి సమాచారం ఇవ్వడంతో 108 సిబ్బంది అక్కడకు చేరుకుని క్షతగాత్రుడిని ఉరవకొండలోని ప్రభుత్వాస్పత్రికి తరలించారు. పరీక్షించిన వైద్యులు అప్పటికే మృతి చెందినట్లు నిర్ధారించారు. విషయం తెలుసుకున్న ఉరవకొండ నియోజకవర్గ వైఎస్సార్‌సీపీ సమన్వయకర్త వై.విశ్వేశ్వరరెడ్డి, జర్నలిస్టులు పి. షెక్షావలి, కె.ఆనందరావు, వడ్డె రమేష్, సాదిక్, వీరేష్ తదితరులు సంతాపం వ్యక్తం చేశారు.

కర్ణాటక సరిహద్దున ప్రమాదంలో ఇద్దరి మృతి

శెట్టూరు: స్థానిక కర్ణాటక సరిహద్దున చోటు చేసుకున్న ప్రమాదంలో ఇద్దరు దుర్మరణం పాలయ్యారు. మృతుల్లో కళ్యాణదుర్గంలో నివాసముంటున్న శ్రీనివాసులు (28), కళ్యాణ్ (31) ఉన్నారు. వ్యక్తిగత పనిపై కర్ణాటకకు వెళ్లి ఆదివారం రాత్రి ద్విచక్ర వాహనంపై తిరుగు ప్రయాణమైన వారు శెట్టూరు మండలంలో ప్రవేశిస్తుండగా అదుపు తప్పి కిందపడి అక్కడికక్కడే మృతి చెందారు. సమాచారం అందుకున్న కర్ణాటక పోలీసులు పరిశీలించి, కేసు నమోదు చేశారు.

క్లుప్తంగా

మీటర్ రీడర్లకు ఉద్యోగ భద్రత కల్పించండి



మాట్లాడుతున్న బాలకాశి

అనంతపురం అర్బన్: విద్యుత్ మీటర్ రీడర్లకు ఉద్యోగ భద్రత కల్పించాలని మీటర్ రీడర్ల సంఘం రాష్ట్ర గౌరవాధ్యక్షుడు బాలాకాశి ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఆదివారం స్థానిక సంఘం కార్యాలయంలో మీటర్ రీడర్లతో సమావేశం నిర్వహించారు. ఏఐటీయూసీ జిల్లా ప్రధాన కార్యదర్శి రాజారెడ్డి, జిల్లా అధ్యక్షుడు రాజేష్‌గౌడ్ తదితరులు మాట్లాడారు. స్మార్ట్ మీటర్లు వస్తున్న తరుణంలో మీటర్ రీడర్లు ఉపాధి కోల్పోయే ప్రమాదం నెలకొందన్నారు. అదే జరిగితే రీడర్ల కుటుంబాలు వీధిన పడతాయని ఆందోళన వ్యక్తం చేశారు. రీడర్లకు ఉద్యోగ భద్రత కల్పిస్తూ కనీస వేతనం అమలు చేయాలన్నారు. రీడర్ల సమస్యలపై ఈనెల 16న ప్రభుత్వ ముఖ్య కార్యదర్శి విజయానంద్‌తో చర్చలు జరిపినా ఫలితం రాలేదన్నారు. సమస్యల పరిష్కారం కోసం పోరాడేందుకు రీడర్లు సిద్ధమవ్వాలన్నారు. సమావేశంలో రీడర్ల సంఘం రాష్ట్ర కోశాధికారి రమేష్‌బాబు, వర్కింగ్ ప్రెసిడెంట్ కిరణ్‌కుమార్, జిల్లా అధ్యక్షుడు రాము, నాయకులు సలీమ్, దస్తగిరి, తదితరులు పాల్గొన్నారు.

శాస్త్రోక్తంగా ధర్మోపనయనాలు



ఉపనయనాలు చేయించుకున్న వారిని ఆశీర్వదిస్తున్న మాతృమూర్తులు

అనంతపురం కల్చరల్: తపోవనంలోని వేదమాత గాయత్రి అమ్మవారి ప్రాంగణంలో ఆదివారం సామూహిక ధర్మోపనయనాలు శాస్త్రోక్తంగా సాగాయి. బ్రాహ్మణ ఉపనయన సేవా సమితి అధ్యక్షుడు సుంకేశుల సత్యనారాయణ ఆధ్వర్యంలో ఉదయం త్రిమత బ్రాహ్మణ వటువులకు వేద పండితులు సత్యనారాయణ, ఫణి బృందం వేద మంత్రోచ్ఛారణల నడుమ సంప్రదాయరీతిలో ధర్మోపనయనాలు చేయించారు. ఉదయం అమ్మవారికి కుంకుమార్చనలు, అభిషేక సేవలు, మహా మంగళహారతి అనంతరం బ్రహ్మోపదేశ కార్యక్రమం ఘనంగా జరిగింది. పలు బ్రాహ్మణ సంఘాల ప్రతినిధులు తరలివచ్చి వివిధ సేవా కార్యక్రమాల్లో పాల్గొన్నారు. ఈ సందర్భంగా బ్రాహ్మణ సంఘం ప్రతినిధులు మాట్లాడుతూ.. సనాతన ధర్మాన్ని కాపాడుతున్న బ్రాహ్మణులు నిత్యాగ్నిహోత్రాలు చేయాలన్నారు. నిత్యం రెండుపూటలా సంధ్య వార్చుకోవాలని సూచించారు. ఫ్యాషన్ ఒరవడిలో సంప్రదాయాలను నిర్లక్ష్యం చేయొద్దన్నారు. మధ్యాహ్నం అన్నప్రసాద వితరణ జరిగింది. కార్యక్రమంలో మందిరం కమిటీ సభ్యులు ప్రసాద్, అనంత్, శర్మ తదితరులు పాల్గొన్నారు.

సుబ్రహ్మణ్యేశ్వరుడి సేవలో ఏఎస్పీ



పూజలు చేయిస్తున్న ఏఎస్పీ వెంకటరమణ మూర్తి

ఆత్మకూరు: పంపనూరులోని సర్పరూప సుబ్రహ్మణ్యేశ్వర స్వామిని ఆదివారం ఏఎస్పీ వెంకటరమణ మూర్తి దర్శించుకుని, ప్రత్యేక పూజలు చేయించారు. ఆలయ ఈఓ బాబు, ఆలయ సిబ్బంది ఏఎస్పీకి శాలువా కప్పి తీర్థప్రసాదాలు అందజేశారు. అంతకుముందు సుబ్రహ్మణ్యేశ్వర స్వామిని పట్టు వస్త్రాలు, బంగారు ఆభరణాలతో అలంకరించారు. స్వామి స్వర్ణముఖ కవచాన్ని ఆలయం చుట్టూ మేళతాళాలతో ప్రదక్షణలు చేయించారు. ఆలయ ప్రాంగణంలో పెద్ద ఎత్తున కాలసర్పదోష రాహుకేతు నివారణ హోమాలు నిర్వహించారు. అలాగే మంజునాథ స్వామి, పార్వతీ దేవిని ప్రత్యేకంగా అలంకరించి మహా మంగళహారతి ఇచ్చారు. అనంతరం భక్తులకు అన్నదానం చేశారు.

ఘంటసాల విగ్రహ ఏర్పాటు అభినందనీయం

అనంతపురం కల్చరల్: అనంతలో అమరగాయకుడు ఘంటసాలకు అద్భుతమైన విగ్రహం, స్మారకమందిరం నిర్మించడం అభినందనీయమని సినీ నిర్మాత, దర్శకుడు సీహెచ్ రామారావు అన్నారు. ఆదివారం రాత్రి అనంతకు విచ్చేసిన ఆయన స్థానిక హౌసింగ్ బోర్డులోని ఘంటసాల స్మారక మందిరాన్ని దర్శించారు. ఘంటసా విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. పాత పాటల ప్రేమికుల సమూహం వారి ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో ట్రస్టు సభ్యులు ఓబుళదాసు, జీవీరామయ్య, గాయనీ గాయకులు మధుసూధనరెడ్డి, అనురాధ, వెంకటేశ్వర్లు తదితరులు ఘంటసాల స్మారక మందిరం ద్వారా సాగుతున్న సంగీత, సేవా కార్యక్రమాలను వివరించారు. భవిష్యత్తులోనూ పెద్ద ఎత్తున ఘంటసాల పేరిట సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహిస్తామని తెలిపారు.



కంప చెట్లు, తీగల మధ్య ప్రమాదకరంగా మారిన ట్రాన్స్‌ఫార్మర్

అధికారుల నిర్లక్ష్యం..

అల్లుకున్న ప్రమాదం

అనంతపురం రూరల్ పంచాయతీ పరిధిలోని సుశీలరెడ్డి కాలనీ రామాలయం సమీపంలో ఉన్న ట్రాన్స్‌ఫార్మర్‌కు చుట్టూ కంప చెట్లు, తీగలు అల్లుకుపోవడంతో ప్రమాదకరంగా మారింది. ట్రాన్స్‌ఫార్మర్‌కు ఫెన్సింగ్ లేకపోవడం, ప్రస్తుతం వర్షాలు కురుస్తున్న తరుణంలో ఏక్షణాన ఏ ప్రమాదం ముంచుకొస్తుందోనని స్థానికులు భయబ్రాంతులవుతున్నారు. ట్రాన్స్‌ఫార్మర్ వద్ద షార్ట్ సర్క్యూట్ అవుతుండటంతో పశువులు మృత్యువాత పడిన సంఘటనలు చోటు చేసుకున్నాయని అక్కడి ప్రజలు చెబుతున్నారు. విద్యుత్తు అధికారులు, పంచాయతీ అధికారులకు ఎన్నిసార్లు చెప్పినా పట్టించుకోలేదని మండిపడుతున్నారు. ఇప్పటికైనా ఉన్నతాధికారులు స్పందించి ట్రాన్స్‌ఫార్మర్ చుట్టూ ఫెన్సింగ్ ఏర్పాటు చేస్తారో లేదో వేచి చూద్దాం..

– అనంతపురం రూరల్:



చెన్నేకొత్తపల్లిలో ప్రధాన రహదారి పక్కన వర్షపు నీరు నిలిచిన దృశ్యం

పారిశుధ్యం అస్తవ్యస్తం

ఇటీవల కురిసిన వర్షాలకు చెన్నేకొత్తపల్లిలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల పక్కన ఉన్న మసీదుకు ఎదురుగా రోడ్డు పక్కన వర్షపు నీరు భారీగా నిలిచింది. నీటిలో చెత్తచెదారం, ఇతర వ్యర్థాలు కలవడంతో దుర్వాసన వస్తోంది. దోమలు పెరిగి రోగాలు వ్యాప్తి చెందే అవకాశం లేకపోలేదు. రహదారి పక్కనే ఉన్న నీరు నిల్వ ఉన్నప్పటికీ పట్టించుకునే వారే కరువయ్యారని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ప్రజలు రోగాల బారిన పడకముందే సంబంధిత అధికారులు స్పందించి పారిశుధ్య చర్యలు చేపట్టాల్సిన అవసరం ఉంది. దోమలు వృద్ధి చెందకుండా చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.

– చెన్నేకొత్తపల్లి:



న్యూట్రిషన్ రిహాబిలిటేషన్ సెంటర్‌లో వంట సిద్ధం చేస్తున్న సెక్యూరిటీ మహిళ

సెక్యూరిటీతో వంట..

ప్రభుత్వ సర్వజనాస్పత్రిలోని న్యూట్రిషన్ రిహాబిలిటేషన్ సెంటర్‌లో సెక్యూరిటీ మహిళతో వంట చేయిస్తున్నారు. ఇటీవల సాక్షిలో 'ఎన్ఆర్‌సీలో చిన్నారుల ఆకలి కేకలు' శీర్షికతో కథనాలు ప్రచురితమయ్యాయి. స్పందించిన జిల్లా వైద్య ఆరోగ్యశాఖ, ప్రభుత్వ సర్వజనాస్పత్రి అధికారులు అతికష్టం మీద ఆస్పత్రిలో విధులు నిర్వర్తించే ఓ సెక్యూరిటీ మహిళను వంట చేసేందుకు ఎన్ఆర్‌సీకి పురమాయించారు. కనీసం రోజు వారి పనిలో భాగంగానైనా ఓ వర్కర్‌ను ఏర్పాటు చేయలేని నిస్సహాయ స్థితిలో అధికారులు ఉన్నట్లు తెలుస్తోంది. ఇప్పటికైనా రెగ్యులర్‌గా ఓ వంట మనిషి ఉండేలా చర్యలు తీసుకోవాలని ఆస్పత్రి వర్గాలు కోరుతున్నాయి. దీనిపై అధికారులు ఏ మేరకు చర్యలు తీసుకుంటారో వేచి చూడాలి.

– అనంతపురం కార్పొరేషన్:

యోగాతో శారీరక, మానసిక వికాసం



అనంతపురంలోని పోలీస్ పరేడ్ మైదానంలో యోగా సాధన చేస్తున్న పోలీసులు



విద్యార్థులకు సర్టిఫికెట్లు అందజేసిన యోగాసన స్పోర్ట్స్ అసోసియేషన్ సభ్యులు

అనంతపురం: యోగాతో శారీరక, మానసిక వికాసం కలుగుతుందని అదనపు ఎస్పీ డీవీ రమణమూర్తి అన్నారు. యోగాంధ్ర కార్యక్రమంలో భాగంగా ఆదివారం పోలీస్ పరేడ్ మైదానంలో సామూహిక యోగాసనాలు సాధన చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రపంచ వ్యాప్తంగా యోగాకు అత్యంత ప్రాధాన్యత సంతరించుకుందన్నారు. కార్యక్రమంలో డీఎంహెచ్ఓ ఈబీ దేవి, సీఐలు ధరణి కిశోర్, హరినాథ్, రాజు, ఆర్ఐలు పవన్ కుమార్, బాబు, ఎస్బీ సీసీ ఆంజనేయ ప్రసాద్, జిల్లా పోలీసు అధికారుల సంఘం అడహక్ కమిటీ సభ్యుడు సాకే త్రిలోక్‌నాథ్, రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు ఆర్ఎస్ఐ జాఫర్, జిల్లా కమిటీ సభ్యుడు గాండ్ల హరినాథ్, జిల్లా వైద్య ఆరోగ్య శాఖ, ఆయుష్ విభాగాల అధికారులు, యోగా ఇన్‌స్ట్రక్టర్లు కృష్ణవేణి, గురురాజారావు, చలపతి పాల్గొన్నారు.

యోగాతో సంపూర్ణ ఆరోగ్యం

కనగానపల్లి: రోజూ క్రమం తప్పకుండా యోగా చేయడం ద్వారా సంపూర్ణ ఆరోగ్యం లభిస్తుందని యోగాసన స్పోర్ట్స్ అసోసియేషన్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు ఎం.రాజశేఖర్‌రెడ్డి తెలిపారు. మండల కేంద్రంలో యోగాసన స్పోర్ట్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో 30 రోజుల పాటు నిర్వహించిన ఉచిత యోగా శిక్షణ కార్యక్రమం ఆదివారం ముగిసింది. ఈ సందర్భంగా స్థానిక ప్రాథమిక పాఠశాలలో ఏర్పాటు చేసిన సమావేశానికి అసోసియేషన్ సభ్యులతో పాటు స్థానిక ప్రజాప్రతినిధులు హాజరయ్యారు. యోగా వల్ల కలిగే ప్రయోజనాలను వివరించారు. స్థానిక ప్రభుత్వ పాఠశాలలో చదువుతున్న 50 మంది విద్యార్థులకు యోగాపై శిక్షణ ఇచ్చినట్లు యోగా గురువు సుబ్బరాయుడు తెలిపారు. అనంతరం శిక్షణలో పాల్గొన్న విద్యార్థులందరికీ సర్టిఫికెట్లు అందజేశారు. కార్యక్రమంలో యోగాసన స్పోర్ట్స్ అసోసియేషన్ జిల్లా ఉపాధ్యక్షుడు శ్రీనివాసులు, సహాయ కార్యదర్శి సాకే ఈశ్వరయ్య, సభ్యులు దివాకర్, గ్రంథాలయాధికారి గోవిందు, మార్కెట్‌యార్డు డైరెక్టర్ మంజునాథ్, స్థానిక సర్పంచ్ అంకె రామక్రిష్ణ పాల్గొన్నారు.

సమస్యల పరిష్కారానికి కృషి



మాట్లాడుతున్న ఎంపీ అంబికా లక్ష్మీనారాయణ

అనంతపురం సిటీ: గ్రామీణ ప్రాంతాల్లో పనిచేసే తపాలా ఉద్యోగుల సమస్యలను పార్లమెంట్‌లో చర్చించి పరిష్కారానికి తన వంతు కృషి చేస్తానని ఎంపీ అంబికా లక్ష్మీనారాయణ అన్నారు. ఆదివారం అనంతపురం ఆర్ట్స్ కళాశాలలో ఏర్పాటు చేసిన అనంతపురం, గుంతకల్లు బ్రాంచ్‌ల ద్వైవార్షిక మహాసభకు ఎంపీ ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. కామ్రేడ్ కేశవరావు, రమణారెడ్డి అధ్యక్షతన నిర్వహించిన మహాసభలో ఆలిండియా యూనియన్ అధ్యక్షుడు వెంకటేశ్వర్లు, అనంతపురం డివిజన్ కార్యదర్శి కృష్ణయ్య యాదవ్ గ్రామీణ ప్రాంత తపాలా ఉద్యోగులు ఎదుర్కొంటున్న సమస్యలపై మాట్లాడారు. వాటి పరిష్కారానికి ఎంపీ చొరవ చూపాలని కోరారు. ఈ అంశంపై ఎంపీ అంబికా సానుకూలంగా స్పందించారు. గ్రామీణ ప్రాంత తపాలా ఉద్యోగులు చాలీచాలని వేతనాలు అందుకుంటూ అనేక సమస్యలను ఎదుర్కొంటున్నారన్నారు. వాటిని కేంద్ర ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి పరిష్కరించేందుకు చొరవ తీసుకుంటానని హామీ ఇచ్చారు. అనంతరం ఎంపీ అంబికాను తపాలా ఉద్యోగుల యూనియన్ నేతలు సత్కరించారు.

నూతన కార్యవర్గం ఏర్పాటు

అనంతపురం డివిజన్ నూతన కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా తిప్పేస్వామి, డివిజన్ కార్యదర్శిగా కృష్ణయ్య యాదవ్, కోశాధికారిగా రామ్మూర్తిని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. గుంతకల్లు బ్రాంచ్ నూతన అధ్యక్షుడిగా శ్రీనివాసులు, కార్యదర్శిగా ఆనంద్, కోశాధికారిగా గంగాధర్ రెడ్డి సహా మరో 15 మంది కార్యవర్గ సభ్యులను ఎన్నుకున్నారు.

ముగిసిన ఇస్లామిక్ వేసవి శిబిరం

అనంతపురం కల్చరల్: నగరంలోని ఇస్లామిక్ సెంటర్‌లో రెండు రోజుల పాటూ సాగిన ఇస్లామిక్ సమ్మర్ క్యాంప్ ఆదివారం ఘనంగా ముగిసింది. ఖురాన్ పఠనం–దాని ప్రాముఖ్యత, మహ్మద్ ప్రవక్త(స) జీవిత విశేషాలు, వ్యక్తిత్వ వికాసం వంటి విషయాలను విద్యార్థులు, యువతకు నేర్పించామని నిర్వాహకులు తెలిపారు. ఈ సందర్భంగా సాగిన సాంస్కృతిక సంబరాలు, క్విజ్ పోటీలు ఆకట్టుకున్నాయి. విజేతలకు బహుమతులు అందజేశారు. స్టూడెంట్స్ ఇస్లామిక్ ఆర్గనైజేషన్ రాష్ట్ర మాజీ అధ్యక్షుడు డాక్టర్ అబ్దుల్లా ఖాన్, రాష్ట్ర క్యాంపస్ కార్యదర్శి రియాజ్ తదితరులు ఇస్లాం సంప్రదాయ, ఆచార వ్యవహారాలను పాటించేలా సూచనలు ఇచ్చారు. కార్యక్రమంలో సంస్థ జిల్లా అధ్యక్షుడు మన్సూర్, నగర అధ్యక్షుడు నిజాముద్దీన్, జమాత్ ఏ ఇస్లామీ సభ్యులు పాల్గొన్నారు.

చిన్న పిల్లలను జాగ్రత్తగా చూసుకోవాలి



మాట్లాడుతున్న జడ్జి రాజశేఖర్

రాప్తాడురూరల్: చిన్న పిల్లలను తల్లిదండ్రులు జాగ్రత్తగా చూసుకోవాలని జిల్లా న్యాయసేవా సదన్ జడ్జి రాజశేఖర్ తెలిపారు. జిల్లా న్యాయసేవా సదన్ ఆధ్వర్యంలో ఆదివారం అనంతపురం రూరల్ మండలం రాచానపల్లి పంచాయతీ పరిధిలోని ఆర్డీటీ పాఠశాలలో 'ఇంటర్నేషనల్ మిస్సింగ్ చిల్డ్రన్ డే' నిర్వహించారు. ముఖ్య అతిథిగా విచ్చేసిన జడ్జి రాజశేఖర్ మాట్లాడుతూ.. పిల్లలు తప్పిపోవడానికి గల కారణాలను వివరించారు. పిల్లలు తప్పిపోయిన సమయంలో తీసుకోవాల్సిన జాగ్రత్తలపై అవగాహన కల్పించారు. తప్పిపోయిన పిల్లలను గుర్తించేందుకు ప్రభుత్వం తీసుకుంటున్న చర్యలను అధికారులు వివరించారు. కార్యక్రమంలో సర్పంచ్ అంజియాదవ్, ఎంపీటీసీ సభ్యులు గౌస్, కృష్ణారెడ్డి, ఎంపీడీఓ దివాకర్, ఎస్ఐ రాంబాబు, కార్మికశాఖ సూర్యనారాయణ, చిన్నపిల్లల సంరక్షణ హోం దేవరాజు, మహిళా శిశు సంరక్షణ శాఖ మంజునాథ్, రెడ్స్ సంస్థ భానూజా పాల్గొన్నారు.

అధిక సుంకం వసూలు దుర్మార్గం



చిరు వ్యాపారులతో మాట్లాడుతున్న సీఐటీయూ నాయకులు

అనంతపురం అర్బన్: తోపుడు బండ్లపై వ్యాపారం చేసుకుంటూ జీవనం సాగిస్తున్న చిరువ్యాపారుల నుంచి మార్కెట్ సుంకం అధికంగా వసూలు చేయడం దోపిడీ కిందకే వస్తుందని సీఐటీయూ నాయకులు మండిపడ్డారు. ఈ పద్ధతిని మార్చుకోకపోతే వీధి వ్యాపారులతో కలిసి నగర పాలక సంస్థ ఎదుట పెద్ద ఎత్తున ఆందోళన చేపడతామని హెచ్చరించారు. వీధి వ్యాపారుల నుంచి మార్కెట్ సుంకం అధికంగా వసూలు చేస్తున్నారని తెలియడంతో ఆదివారం సీఐటీయూ నాయకులు నడిమివంక వద్ద వీధి వ్యాపారులతో మాట్లాడారు. సుంకం ఎంత వసూలు చేస్తున్నారు? ట్రాఫిక్ పోలీసులు జరిమానా ఎంత విధిస్తున్నారని అడిగి తెలుసుకున్నారు. సుంకం అధికంగా వసూలు చేస్తున్నట్లు కొందరు వ్యాపారులు తెలిపారు. సీపీఎం జిల్లా కోశాధికారి గోపాల్, నగర కార్యదర్శి వెంకట నారాయణ మాట్లాడుతూ.. నగర పాలక సంస్థ నిర్ణయించిన సుంకం రూ.5 వసూలు చేయాల్సి ఉండగా అంతకు మంచి వసూలు చేస్తున్నట్లు తమ విచారణలో తేలిందన్నారు. ఇక చిరువ్యాపారులపై ట్రాఫిక్ పోలీసులు వేధింపులు ఎక్కువయ్యాయన్నారు. నిబంధనలకు విరుద్ధంగా బండ్లు పెట్టి వ్యాపారం చేస్తున్నారంటూ చిరు వ్యాపారులపై జరిమానా విధిస్తున్నారన్నారు. జరిమానా చెల్లించకపోతే తక్కెడను స్టేషన్‌కు తీసుకెళ్తూ.. జరిమానా కట్టి తీసుకెళ్లాలని చెబుతున్నారని మండిపడ్డారు. ఇలాంటి చర్యలను ట్రాఫిక్ పోలీసులు మానుకోవాలన్నారు. కార్యక్రమంలో సీఐటీయూ నగర అధ్యక్షుడు శ్రీనివాసులు, కేవీపీఎస్ వెంకటేష్, నాయకుడు రామాంజనేయులు పాల్గొన్నారు.

కల్లూరు సుబ్బారావు సేవలు చిరస్మరణీయం



బాలగొండ ఆంజనేయులును సత్కరిస్తున్న దృశ్యం

అనంతపురం కల్చరల్: అపారమైన త్యాగగుణం, విశిష్టమైన వ్యక్తిత్వంతో 'అనంత'కు ఎనలేని సేవలందించిన కల్లూరు సుబ్బారావు చిరస్మరణీయులని వక్తలు కొనియాడారు. ఆదివారం రాత్రి లలిత కళాపరిషత్ ప్రాంగణంలో కల్లూరు సుబ్బారావు జయంతి ఘనంగా నిర్వహించారు. ఎల్కేపీ కార్యదర్శి పద్మజ నేతృత్వంలో జరిగిన కార్యక్రమంలో డీఆర్వో మలోల, విశ్రాంత న్యాయమూర్తి క్రిష్టప్ప, ఎల్కేపీ ఉపాధ్యక్షులు సంగాల నారాయణ స్వామి, రామగోవిందు తదితరులు మాట్లాడారు. కల్లూరు సుబ్బారావు స్ఫూర్తిదాయకమైన జీవితాన్ని గురించి ప్రసంగించారు. రాయలసీమలోనే తొలి రాజకీయ ఖైదీ అయిన సుబ్బారావు జీవితాంతం దేశభక్తితో జీవించారన్నారు. ఆయన త్యాగానికి హద్దులు లేవని.. సొంత స్థలాన్ని లలిత కళాపరిషత్, కాంగ్రెస్ పార్టీ కార్యాలయానికి అందజేశారని గుర్తు చేశారు. తొలుత ప్రాంగణంలో ఉన్న కల్లూరు సుబ్బారావు విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కవి, సినీ దర్శకుడు బాలగొండ ఆంజనేయులును కల్లూరు సుబ్బారావు అవార్డుతో సత్కరించారు. అనంత సాహిత్యానికి బాలగొండ చేసిన సేవలను కొనియాడారు. ఆయనకు నగదు బహుమతితో పాటు, జ్ఞాపికలు అందజేసి గౌరవించారు. ఈ సందర్భంగా నిర్వహించిన సాంస్కృతిక కార్యక్రమాల్లో చిన్నారుల జానపద నృత్యాలు అలరించాయి. కార్యక్రమంలో ఎల్కేపీ సభ్యులు సోమిరెడ్డి, రామాంజనేయులు, ఆదినారాయణ రెడ్డి, కుళ్లాయప్ప, ఆనంద్, ఆచార్య సుధాకర బాబు, ఉంగరాల శీన, సీనియర్ గాయని రమా రెడ్డి, రియాజుద్దీన్ తదితరులు పాల్గొన్నారు.

ఆంధ్ర క్రికెట్ జట్టులో దత్తా, వినయ్



మచ్చా దత్తారెడ్డి



వినయ్ కుమార్

అనంతపురం: ఈ నెల 29 నుంచి ఉత్తరాఖండ్ రాజధాని డెహ్రాడూన్ వేదికగా సాగే దేవ్‌భూమి సీనియర్ అంతర రాష్ట్ర క్రికెట్ పోటీల్లో ప్రాతినిథ్యం వహించే ఏపీ జట్టులో జిల్లాకు చెందిన మచ్చా దత్తారెడ్డి, వినయ్‌కుమార్ చోటు దక్కించుకున్నారు. కుడిచేతి వాటం బ్యాటర్‌గా ఇప్పటికే దత్తారెడ్డి టాప్–ఆర్డర్‌లో కొనసాగుతున్నాడు. వికెట్ కీపర్‌గానూ మంచి ప్రతిభను చాటాడు. గత రెండు సీజన్లలో ఆంధ్ర అండర్–19 జట్టులో విశేష ప్రతిభ కనబరిచాడు. ఇటీవల కడపలో గోవాపై జరిగిన మ్యాచ్‌లో సెంచరీ సాధించి సెలెక్టర్లను ఆకర్షించాడు. దీంతో అండర్–23 పురుషుల జట్టులో చోటు దక్కింది. అలాగే కురుగుంట గ్రామానికి చెందిన బి.వినయ్ కుమార్ ఆల్‌రౌండర్ ప్రతిభతో రాణిస్తున్నాడు. ఆంధ్ర జట్టులో చోటు దక్కించుకున్న జిల్లా క్రీడాకారులను జిల్లా క్రికెట్ సంఘం అధ్యక్షుడు ప్రకాష్‌రెడ్డి, కార్యదర్శి భీమలింగారెడ్డి అభినందించారు.

నాసిరకం సాఫ్ట్‌వేర్‌తో బెంబేలు

అనంతపురం ఎడ్యుకేషన్: ఉపాధ్యాయుల బదిలీల్లో గడువు ముగుస్తున్నా దరఖాస్తు చేసుకోవడానికి కొందరు ఉపాధ్యాయులకు ఆన్‌లైన్ ఓపెన్ కావడం లేదని రాష్ట్రోపాధ్యాయ సంఘం (ఎస్టీయూ) జిల్లా అధ్యక్షుడు నీలూరి రమణారెడ్డి వాపోయారు. ఈ మేరకు ఆదివారం ఓ ప్రకటన విడుదల చేశారు. అప్లికేషన్ పూర్తి చేయడానికి పీఈటీలు, ఎల్‌పీటీలు ప్రయత్నిస్తే సైట్ ఓపెన్ కావడం లేదన్నారు. రిఆపోర్షన్‌కు ఎఫెక్ట్ అయినవారికి పాత స్టేషన్ పాయింట్స్ ఉపయోగించుకునేలా ఉంచిన ఎస్ బటన్ క్లిక్ చేసినా '0' పాయింట్స్ వస్తున్నాయన్నారు. సబ్‌మిట్ చేయడానికి వెళ్తే ఎర్రర్ అని వస్తోందన్నారు. అర్ధరాత్రి వరకు మేల్కొని డీఈఓ ఏర్పాటు చేసిన సెంటర్‌కు వెళ్లి గ్రీవెన్స్ ఇచ్చినా ఏమాత్రం ఫలితం లేకుండా పోయిందన్నారు. లీగలీ సెపరేట్ అయిన మహిళా ఉపాధ్యాయులు, రెండు సార్లు రీ అపోర్షన్‌కు గురై బదిలీకి దరఖాస్తు చేస్తే ప్రీవియస్ స్టేషన్ పాయింట్స్ '0' పాయింట్స్ వస్తున్నాయన్నారు. నాసిరకం సాఫ్ట్‌వేర్‌తో ఉపాధ్యాయులు బెంబేలెత్తుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తికి గాయాలు

బుక్కరాయసముద్రం: వెంకటాపురం సమీపంలో అనంతపురం–నార్పల రహదారిపై జరిగిన రోడ్డు ప్రమాదంలో అనంతపురంలోని సుశీలరెడ్డి కాలనీకి చెందిన ప్రసాద్ (జేఎన్‌టీయూ అటెండర్) తీవ్రంగా గాయపడ్డాడు. స్థానికులు అతడిని చికిత్స నిమిత్తం 108 వాహనంలో అనంతపురం ప్రభుత్వాస్పత్రికి తరలించారు.

'నందమూరి వంటి నటుడు మళ్లీ పుట్టరు'



ఆర్డీఓ మలోలను సత్కరిస్తున్న గాయకులు

అనంతపురం కల్చరల్: నందమూరి తారక రామారావు వంటి మహానటుడు మళ్లీ పుట్టరు. ఆయన కళా సాధనను కొనసాగించడమే మనమిచ్చే ఘనమైన నివాళి అని పలువురు వక్తలు అన్నారు. ఘంటసాల ఆరాధన సమితి వ్యవస్థాపకుడు పాలసముద్రం నాగరాజు ఆధ్వర్యంలో ఆదివారం జరిగిన ఎన్టీఆర్ అపూర్వ సంగీత సత్సంగం అలరించింది. స్థానిక మూడవ రోడ్డు ఘంటసాల భవన్ వేదికగా ఎన్టీఆర్ కళానీరాజనం పేరిట సాగిన కచేరీలో జిల్లాలోని పలు ప్రాంతాల నుంచి గాయనీ గాయకులు విచ్చేసి ఆ పాత మధురాలతో ఆకట్టుకున్నారు. అతిథిగా విచ్చేసిన డీఆర్వో మలోలను కళాకారులు ఘనంగా సత్కరించారు. పాలసముద్రం నాగరాజు శ్రీదేవి, పద్మజ, బృంద, లక్ష్మీనారాయణ, ఆచార్య సుధాకర బాబు తదితరులు ఘంటసాల, ఎన్టీఆర్ కాంబినేషన్‌లో వచ్చిన పాటలను పాడారు.

భగవద్గీత పరమార్థం తెలుసుకోండి



లింగనపల్లిలో భగవద్గీత ప్రచారం చేస్తున్న త్రైత సిద్ధాంత ప్రబోధసేవా సమితి సభ్యులు

రాప్తాడు: గురుపౌర్ణమికి ఆరాధ్యుడు శ్రీకృష్ణ భగవానుడే అని త్రైత సిద్ధాంత ప్రబోధసేవా సమితి ఇందూ జ్ఞానవేదిక జిల్లా అధ్యక్షుడు మల్లికార్జున పేర్కొన్నారు. ఆదివారం మండలంలోని లింగనపల్లి, గొల్లపల్లి, రామినేపల్లి, మరూరు తదితర గ్రామాల్లో భగవద్గీత, 100 రకాల త్రైత సిద్ధాంత గ్రంథాలను ప్రచారం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. భగవద్గీతను ప్రతి ఒక్కరూ జీవితంలో ఒక సారి అయినా చదవి, భగవద్గీత మారమార్థం తెలుసుకోవాలన్నారు. అనంతరం భగవద్గీత పుస్తకాలను వితరణ చేశారు. కార్యక్రమంలో త్రైత సిద్ధాంత ప్రబోధసేవా సమితి ఇందూ జ్ఞానవేదిక సభ్యులు సూర్యనారాయణ రెడ్డి, నాగిరెడ్డి, సుధాకర్, ఇందిర, నాగమణి, చరంజివి, లక్ష్మీదేవి, మాధవి, నాగేశ్వరి, నీలావతి, విజయలక్ష్మి, శివ సాయి, గౌతమి, సోమశేఖర్ తదితరులు పాల్గొన్నారు.